



సీతారామపురం : ఘటిక సిద్ధేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు





నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో భక్తుల రద్దీ

# శివోహం

## శివనామస్మరణతో మారుమోగిన జిల్లా

## భక్తులతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

చర్మాంభరాయ శివభస్మ విలేపనాయ
ఫాలేక్షణాయ మణికుండల మండితాయ
మంజీరపాదయుగళాయ జటాధరాయ
దారిద్ర్య దుఃఖ దహనాయ నమశ్శివాయ

నెల్లూరు (సాంస్కృతికం) : శివనామస్మరణతో శైవక్షేత్రాలు పోటెత్తాయి. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా జిల్లావ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శివలింగానికి పాలభిషేకం చేసేందుకు ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, గిన్నెభిక్ష వేడుకలు, రుద్రహోమాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, లింగోద్భవ అభిషేకాలు కన్నుల పండువగా జరిగాయి. శనివారం తెల్లవారుజామున నందిసేవలో శివపార్వతులకు నగరోత్సవాలు జరిగాయి. తరలివస్తున్న భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పాలకవర్గం సకల ఏర్పాట్లు చేసింది. నెల్లూరులోని మూలస్థానేశ్వరుడు, కావలిలోని శివాలయం, జొన్నవాడ, గండవరం ఉదయకాళేశ్వరస్వామి ఆలయాలతో పాటు అన్ని మండలాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. కాటేపల్లి, కోడూరు, మైపాడు, రామతీర్థం, తదితర సముద్ర తీర ప్రాంతాల్లో వేలాది మంది సముద్ర స్నానాలు చేసి, సైకత శివలింగాలకు పూజలు చేశారు. శివరాత్రి సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాలు వితరణలు చేశారు. ఇక 'వెలుగొండ'ల్లోని దొరువుల్లో వెలసిన ఆలయాలకు భక్తులు చేరుకుని పూజలు చేశారు. జిల్లా సరిహద్దులోని భైరవకోన, ఘటిక సిద్దేశ్వరానికీ భక్తులు పోటెత్తారు.

● నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పాలభిషేకాల కోసం బారులుతీరారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాల్లో శివనామస్మరణలు మారుమోగాయి. గిన్నెభిక్ష ఉత్సవం వైభవంగా జరిగింది. భువనేశ్వరి అమ్మవారికి నిత్యపూజలు, విశేష అలంకారం జరిగింది. జిల్లా న్యాయాధికారి యామిని, కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, ఎస్పీ తిరు మలేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదిదంపతులను దర్శనం చేసుకున్నారు. రాత్రి భక్తిశ్రద్ధలతో లింగోద్భవ అభిషేకాలు జరిగాయి. తెల్లవారు జామున శివపార్వతులు వెండినందిపై విహరిం చారు. ఆలయ ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ఈవో వేణుగోపాల్, ధర్మకర్తలు, ఉభయకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.




ఆత్మకూరు : శివాలయంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుడి కల్యాణం



సంగం : భీమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం



కావలిలో రావణాసురుడిపై మల్లన్న



తోటపల్లిగూడూరు : మైపాడులో సముద్ర స్నానం చేస్తున్న ప్రజలు



నెల్లూరులో శివలింగాన్ని అభిషేకిస్తున్న భక్తులు



బుచ్చిరెడ్డిపాళెం : ఆదిదంపతుల దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

# అవస్థలకు 'సిద్ధం' కండి!

భద్రత ఉండదు.. బస్సులూ ఉండవు!

నేటినుంచి మూడు రోజులు తిప్పలే!

మేదరమిట్లలో రేపు సీఎం సభ

జిల్లా పోలీసులంతా అక్కడకు పయనం

బాపట్లకు పరుగులు తీసిన ప్రగతి చక్రాలు

**జిల్లావాసులకు ముఖ్య గమనిక. మూడు రోజులపాటు జిల్లాలో భద్రత, బస్సులు రెండవు ఉండవు. ఏదైనా నేరం జరిగితే పోలీసు స్టేషన్‌కు చేరుకోవడానికి బస్సులుండవు. ఏదో ఒక బాధపడి స్టేషన్‌కు చేరుకున్నా భద్రత కల్పించడానికి పోలీసులు ఉండరు. ఈ మూడు రోజులపాటు ఈ రెండు దొరకాలంటే బాపట్ల జిల్లా మేదరమిట్లలో జరిగే సిద్ధం సభ వద్దకు వెళ్లాల్సిందే. ఎందుకంటే జిల్లాలోని 90 శాతం మంది పోలీసులను ఈ సభకు హాజరయ్యే సీఎం బందోబస్తుకు తరలించారు. అలాగే జనసమీకరణ కోసం జిల్లాలోని 90 శాతం ఆర్టీసీ బస్సులనూ దారి మళ్లించారు. జిల్లాలో ఈ రెండు శాఖలు సంపూర్ణంగా అందుబాటులోకి రావాలంటే మంగళవారం వరకు ఆగాల్సిందే!**

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు పోలీస్ సబ్ డివిజన్లు ఉండగా, 53 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఏఆర్, సివిల్, స్పెషల్ పార్టీలు అన్నీ కలిపి సుమారు 3వేల మంది వరకు పోలీసులు ఉన్నారు. వీరిలో 80 శాతం మందిని ఆదివారం మేదరమిట్లలో జరిగే 'సిద్ధం' సభ బందోబస్తుకు వేశారు. ఒక్కో స్టేషన్‌లో 1ప్లస్2 అంటే ఒక రైటర్, ఇద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే ఉంచి మిగిలిన వారందరికి బందోబస్తు డ్యూటీ వేశారు. వీరంతా శనివారం ఉదయానికల్లా మేదరమిట్లలో రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుంది. అంటే శుక్రవారం రాత్రి నుంచే స్టేషన్లు ఖాళీ. తిరిగి వీరంతా విధుల్లో చేరేది 12వ తేది. అంటే ఈ మూడు రోజులు జిల్లాలో పోలీసు సేవలు నామమాత్రంగానే అందనున్నాయి.

● **500లకుపైగా బస్సులు**

జిల్లాలో 628 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వీటిలో 332 బస్సులను సిద్ధం సభకు జనాన్ని తరలించడానికి కేటాయించినట్లు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. అయితే, అనధికారికంగా 500 బస్సులకు పైగా కేటాయించనున్నట్లు ఆర్టీసీ యూనియన్ నాయకుల సమాచారం. అంటే సుమారు 80శాతం బస్సులు సీఎం సభకు కేటాయించారు. శనివారం ఉదయం నుంచే వీటిని రూట్ల వారీగా విభజించారు. మధ్యాహ్నానికే ఈ బస్సులన్నీ డిపోలకు చేరుకుంటాయి. రాత్రికి వాటికి కేటాయించిన ప్రాంతాలకు బయలుదేరి వెళతాయి. ఆదివారం వేకువజాము నుంచి జనాన్ని మేదరమిట్లకు తరలిస్తాయి. ఈ బస్సులు తిరిగి జిల్లావాసులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే సోమవారం మధ్యాహ్నం దాటుతుంది. అంటే శనివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు రెండు రోజుల పాటు ప్రజలకు ఆర్టీసీ బస్సులు ఉండవు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు తప్ప అంతర్‌జిల్లా రూట్లలో తిరిగే బస్సులు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలకు తిరిగే సర్వీసులు ఉండవు. శనివారం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు జిల్లా ప్రజలు ప్రయాణాలను వాయిదా వేసుకోక తప్పనిపరిస్థితి. కాగా, సోమవారం ఉదయం ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకూ రవాణా కష్టాలు తప్పేలా లేవు.

## బస్సులు ఇవ్వాల్సిందే!

**ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులకు రవాణా శాఖ అధికారుల హుకుం**

కందుకూరు, మార్చి 8 : వైసీపీ ఎన్నికల సన్నాహంలో భాగంగా మేదరమిట్ల వద్ద సిద్ధం పేరుతో ఆదివారం నిర్వహిస్తున్న సీఎం జగన్మోహనరెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం రవాణాశాఖ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. శనివారం సాయంత్రానికల్లా ప్రైవేటు విద్యాసంస్థల బస్సులన్నీ తమకు స్వాధీనం చేయాలని ఆ శాఖ అధికారులు హుకుం జారీచేశారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ దశలో రేయింబవళ్లు స్టడీ అవర్స్ పెట్టుకుని పరీక్షలకు సిద్ధమవుతున్న వేళ విద్యార్థులను తీసుకురావడం, మరలా వారిని ఇళ్లకు పంపించడం బస్సులు లేకుండా కష్టమని.. ఈ విడతకు తమను వదిలేయమని విద్యాసంస్థల నిర్వాహకులు ప్రాధేయపడినా ససేమీరా అంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి తమపై వత్తిడి అధికంగా ఉందనీ, బస్సులు ఇవ్వాల్సిందేనంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడటంతో చేసేది లేక శని, ఆదివారాలు సెలవులు ప్రకటించేసి బస్సులను అప్పగిస్తున్నారు.

సాధారణంగా ఎన్నికల కోడ్ వస్తోందంటే అధికారులు, ఉద్యోగుల్లో భయం పెరుగుతుంటుంది. ఎన్నికల విధుల నిర్వహణ కత్తిమీద సాము లాంటిది కావడంతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుందని మథనపడుతుంటారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల కోడ్ ఎప్పుడు వస్తుందా!? అని వారంతా ఎదురుచూస్తున్నారు. అందుకు కారణం అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడమే. ఆ పని చేయండి.. ఈ పని చేయండి.. ఆ ఆర్డర్ ఇవ్వడం.. ఈ ఆర్డర్ ఇవ్వండి.. అంటూ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేతలు ఆదేశాలు ఇస్తుండటంతో అధికారులు, ఉద్యోగులు తట్టుకోలేకపోతున్నారు. ఈ ఒత్తిడి కన్నా ఎన్నికల ఒత్తిడే మేలంటూ వ్యాఖ్యానిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

# కోడ్ ఎప్పుడొస్తుంది!?

ఆత్రుతగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

పెరుగుతున్న అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు

● నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయాలంటూ ఆదేశాలు ● ఒత్తిడి తట్టుకోలేక సతమతం

నెల్లూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధానంగా రెవెన్యూ, ఇంజనీరింగ్, మున్సిపల్ శాఖల్లోని అధికారులు, ఉద్యోగులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలన్న ధోరణి వైసీపీ నాయకుల్లో కనిపిస్తోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని సర్వేలు చెబుతున్న నేపథ్యంలో ఇప్పుడే తమ పనులు పూర్తి చేసుకోవాలని అధికారులు, ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. అదే సమయంలో వీటన్నిటినీ గమనిస్తున్న ప్రతిపక్ష నేతలు.. వైసీపీ నేతలు చెప్పినట్లు చేస్తే రేపు తాము అధికారంలోకి వచ్చాక విచారణలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. దీంతో ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్లుగా తయారైంది వారి పరిస్థితి.

● **నలిగిపోతున్న అధికారులు, ఉద్యోగులు**

అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ, ఇరవై ఏళ్లు దాటిన అసైన్‌మెంట్ పట్టాలకు హక్కులు కల్పించడం వంటి ప్రక్రియల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు మొదటి నుంచీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులు కాని వారిని కూడా అసైన్‌మెంట్ జాబితాలో చేర్చినట్లు ప్రచారం జరిగింది. ఇప్పటికే పలు విడతల జాబితాను ఆమోదించారు. ఈ క్రమంలో మరికొన్ని భూములకు సంబంధించిన వ్యవహారాలను కూడా పూర్తి చేసేలా తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ శాఖలో పనులు చేయకుండానే బిల్లులు పెడుతున్న వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. తూతూమంత్రంగా పనులు చేయడం, ఇష్టారీతిన ఎస్టిమేషన్లు రివైజ్ చేయడం వంటివి జరిగిపోతున్నాయి. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు ఇన్నాళ్లూ తలొగ్గి వ్యవహ రించిన అధికారులు, ఎన్నికలు సమీపి స్తున్న తరుణంలో తప్పులు చేసేందుకు వెనకాడుతున్నారు. ఆర్అండ్ బీ, పంచా యతీరాజ్ శాఖల్లో అనేక మార్లు టెండర్లు పిలిచినా రోడ్లు బాగు చేసేందుకు కాంట్రా క్టర్లు ముందుకు రావడం లేదు. కొన్ని వర్కులకు టెం డర్లు వేసిన తర్వాత కూడా ప్రభుత్వం బిల్లులు చెల్లించని తీరుతో కాంట్రా క్టర్లు పనులు చేయడం లేదు. ఇది వైసీపీకి తీవ్ర నష్టం చేస్తుండడంతో ఎలాగైనా రోడ్డు పనులు మొదలుపెట్టించాలని ఆయా శాఖల అధికారులపై ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. బ్లాక్ లిస్టులో పెడతామంటూ కాంట్రా క్టర్లను బెదిరించాలని సూచిస్తుండడం, ప్రస్తుతం ఎవ రెన్ని చెప్పినా పనులు చేసే స్థితిలో కాంట్రాక్టర్లు లేకపోవడంతో మధ్యలో ఇంజనీర్లు నలిగిపోతున్నారు. ఉపాధి హామీ పథకం కింద కూడా పలు చోట్ల పనులు చేయకుండానే చేసిన ట్లుగా బిల్లులు రికార్డు చేయాలంటూ క్షేత్రస్థాయి సిబ్బం దిపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితులు అధికార, ఉద్యోగ వర్గాలు ఎదుర్కొం టుండడంతో త్వరగా ఎన్నికల కోడ్ వస్తే తాము ఈ ఒత్తిళ్ల నుంచి తప్పించుకుంటామని భావిస్తున్నారు.






మహిళా దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి బీద జ్యోతికి తినిపిస్తున్న మాజీ మంత్రి నారాయణ

## ఆత్మకూరు నుంచే పోటీ చేస్తా

● **మాజీ మంత్రి ఆనం**

చేజర్ల, మార్చి 8 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆత్మకూరు నుంచే తాను పోటీ చేయనున్నట్లు మాజీ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కోటితీర్థం శివాలయానికి వెళుతూ చేజర్ల మండలంలోని పెరుమాళ్ల పాడు సమీపంలోని ఆనం ఫాం హౌస్‌లో టీడీపీ నాయకులతో ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆనం మాట్లాడుతూ పదేళ్లుగా ఆత్మకూరు వాసులు అభివృద్ధికి దూరంగా ఉన్నారని, ఏ కుటుంబం సంతోషంగా లేదని అన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల వైఫల్యమేమని అన్నారు. రాబోయే రోజుల్లో తిరిగి అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కాగా ఆనం ప్రకటనతో కొంత కాలంగా ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై నెలకొన్న ఉత్కంఠ వీడినట్టు అయ్యింది.

## నేడు బీజేపీ క్లస్టర్ సమావేశం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో బీజేపీ క్లస్టర్ సమావేశం శనివారం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి తదితరులు పాల్గొంటున్నారు.

## సోమశిలలో 14.393 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, మార్చి 8 : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శుక్రవారం జలాశయంలో 14.393 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1950, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

# మంచినీటి పథకానికి 'తుప్పు'!

● నిరుపయోగంగా రాజీవ్ టెక్నాలజీ సబ్ మిషన్ ప్రాజెక్టు

● రూ.లక్షల ప్రజాధనం వృథా.. పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన మైక్రోఫిల్టర్



తుప్పుపడుతున్న మోటార్లు

ఉదయగిరి రూరల్, మార్చి 8 : ప్రజల దాహం తీర్చేందుకు గండిపాళెం జలాశయం వద్ద ఏర్పాటు చేసిన రాజీవ్ టెక్నాలజీ సబ్ మిషన్ ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా శుద్ధినీరు అందించాల్సిన ప్రాజెక్టు శిథిలావస్థకు చేరుకుంది. ఉదయగిరి మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద 2002లో అప్పటి కేంద్ర మంత్రి, ముప్పవరపు వెంకయ్యనాయుడు చొరవతో రూ.7.55 కోట్లతో రాజీవ్ టెక్నాలజీ సబ్ మిషన్ ప్రాజెక్టు నిర్మించారు. నియోజకవర్గంలోని వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు, కొండాపురం, మర్రిపాడు మండలాల్లోని 66 గ్రామాలకు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. అయితే ప్రాజెక్టు ప్రారంభ దశలోనే పైపులైన్లు సరిగా లేకపోవడంతో అరకొర గ్రామాలకు నీరు సరఫరా చేశారు. రానురాను ప్రాజెక్టు నిర్వహణ పట్టించుకోకపోవడంతో వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 44 గ్రామాలకు పరిమితమైంది. అనంతరం ఆయా మండలాల్లో 11 గ్రామాలకు నీటి సరఫరా చేస్తుండగా ప్రస్తుతం పథకం మూలకు చేరి నీటి సరఫరా కూడా నిలిచిపోయింది. పథకం వద్ద మైక్రోఫిల్టర్, నీటిని శుద్ధిచేసే శాండ్‌స్లో ఫిల్టర్లు, పంపుహౌస్‌లో మోటార్లు, ఇతరత్రా పరికరాలు తుప్పుపట్టిపోయాయి. మరికొన్ని వస్తువులు చోరీకి గురవుతున్నాయి. గ్రామాల్లో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు దిష్టిబొమ్మల్లా మారాయి. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే పథకం లక్ష్యం నీరుగారి రూ.లక్షలు ప్రజాధనం వృథా అయ్యిందని పలువురు ఆరోపిస్తున్నారు.

# దుకాణాల మద్యం.. 'బెల్టు'కు పయనం!

• చేతివాటం చూపుతున్న సిబ్బంది • రూ.10 అదనంగా బ్లాక్‌లో విక్రయం

• ఎన్నికల వేళ జోరుగా వ్యాపారం • సీసీ కెమెరాలు ఉన్నా ఇంటర్నెట్ ఏదీ!?




ప్రభుత్వ మద్యం దుకాణం (ఫైల్)

**నెల్లూరు (క్రైం), మార్చి 8** : ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే జిల్లాలో ఎన్నికల హడావుడి జోరందుకుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిం చడంతో ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో ప్రచారం ఏ ప్రాంతంలో జరుగుతుంటే ఆ ప్రాంతాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం వ్యాపారం మూడు ఆఫ్‌లు ఆరు క్వార్టర్లుగా సాగుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి లాట్‌గా మద్యం కొనుగోలు చేస్తున్న బెల్ట్ నిర్వాహకులు ఎమ్మార్పీపై రూ.50లకు అదనంగా విక్రయిస్తున్నారు. బార్లకు వెళ్లి మద్యం తాగాలన్నా రూ.60 అధికంగా చెల్లించాల్సిందే. ఇక ఆటో చార్జీలు అదనం అని భావిస్తున్న మందుబాబులు బెల్ట్ దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేస్తున్నారు. ఏ కష్టం లేకుండా క్వార్టర్ బాటిల్‌పై రూ.40 అదనపు ఆదాయం రావడం, రోజుకు కనీసం 20 సీసాలు విక్రయించినా రూ.800 వరకు ఆదా యం వస్తోంది. దీంతో పల్లెల్లో వీధివీధినా బెల్టు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే సిబ్బందే బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు సెబ్ అధికారులు గుర్తించారు. ఇటీవల నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మన్ రమేష్ ఓ బెల్టుషాపునకు మద్యం విక్రయిస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నారు.

**• దిష్టిబొమ్మల్లా కెమెరాలు**

ఉదయం దుకాణ తలుపులు తెరిచిన వెంటనే పదుల సంఖ్యలో మందుబాబులు క్యూలో ఉంటున్నారు. అప్పటికప్పుడు మద్యం సీసాను స్కాన్ చేయడం కష్టంగా మారుతుండటంతో ఒకేసారి ఉదయం కొన్ని సీసాలను స్కాన్ చేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో డిమాండ్ ఉన్న బ్రాండ్‌లను బెల్ట్‌షాపుల నిర్వాహకులకు అప్పగిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి 20 వరకు బ్రాండ్‌ను మద్యం దుకాణాల్లోని సిబ్బంది విక్రయిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా సేల్స్ తక్కువగా ఉండే సమయం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటలలోపు, సాయంత్రం 7 నుంచి 8 గంటల్లోపు ఈ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అయితే, మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా, వాటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వలేదు. ఇది దుకాణాల్లోని సిబ్బందికి బాగా కలిసి వస్తోంది.

**తప్పు చేస్తే శిక్ష తప్పదు**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి సమావేశాలు ఏర్పాటు చేసి పలు విషయాలపై అవగాహన కల్పించాము. నిబంధనలకు విరుద్ధంగా అవకతవకలకు పాల్పడితే ఉద్యోగాలు పోతాయని హెచ్చరించాము. తప్పు చేస్తే శిక్షలు తప్పవు.

\- నాగమల్లేశ్వరరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

## మహిళలకు సమాన హక్కుల ఘనత టీడీపీదే

• మాజీ మంత్రి పొంగూరు నారాయణ

• టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న పొంగూరు నారాయణ

**నెల్లూరు(వ్యవసాయం), మార్చి 8** : మహిళలకు అన్నింటా సమాన హక్కులు కల్పించింది తెలుగుదేశం పార్టీ అని మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీ.రామారావు, నారా చంద్రబాబునాయుడు మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో మహిళలను అన్ని విధాలా ఆదుకునేందుకు అవకాశాలు కల్పించామని వివరించారు. బీద జ్యోతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే వంటి గొప్ప వారిని స్మరించుకోవడమే మహిళా దినోత్సవం రోజున వారికిచ్చే గొప్ప నివాళని చెప్పారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్లపాక అనూరాధ, భూలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## భూ పంపిణీ అవకతవకలపై లోకాయుక్తకు ఫిర్యాదు

• జగనన్న ఇళ్ల స్థలాల భూముల కొనుగోలులోనూ అక్రమాలు

• లిఖితపూర్వకంగా ఆధారాలతో ఆశ్రయించిన టీడీపీ నాయకులు

**పొదలకూరు, మార్చి 8**: మండలంలో రెండేళ్ల కిందట జరిగిన భూ కుంభకోణాలు, అక్రమాలపై అప్పటి తహసీల్దారు తలపుల స్వాతిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసి ఆమెను సస్పెండ్‌కు కారణమైన టీడీపీ నాయకులు ప్రస్తుత రెవెన్యూ అధికారుల అక్రమాలపై మండలంలోని ఎర్రపల్లి గ్రామానికి చెందిన నేలపాటి పెంచలప్రసాద్ లోకాయుక్తను ఆశ్రయించారు. పేదల అసైన్‌మెంట్ భూ పంపిణీ, జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపు స్థలాల విషయంలోనూ అవకతవకలు అక్రమాలు జరిగాయని వీటిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేశారు. వాగులు, వంకలు, కొండపోరంబోకు, మేత పోరంబోకు భూములను, కోర్టు వివాదాల్లోనున్న భూములను పెద్ద ఎత్తున లంచాలు తీసుకుని అనర్హులైన వారికి అధికారులు నిబంధనలు విరుద్ధంగా కేటాయించారని పేర్కొన్నారు. మండలంలోని జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించిన లే అవుట్లలో కొన్ని ప్రభుత్వ స్థలాలు ప్రైవేటు వ్యక్తుల భూములుగా చూపించి, వన్‌బీలు పుట్టించి కొనుగోలు చేసినట్లుగా తెలిపారు. ఇందులో తహసీల్దారులు, ఆర్డీవో ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆరోపించారు. మండలంలోని ప్రభగిరిపట్నం, ఎర్రబల్లి, నేదురుపల్లి, ఇనుకుర్తి, వావింటపర్తి, బత్తులపల్లి, కొత్తకంబాలపల్లి, మరుపూరు గ్రామాల్లో ఇలాంటి అవకతవకలు ఉన్నట్లు కొన్ని సర్వే నెంబర్లను చూపించారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లో జరిగిన పేదలకు అసైన్‌మెంట్ భూ పంపిణీల సమాచారం అడిగినా ఆయా తహసీల్దార్లు ఇవ్వకపోవడంపై అనుమానం ఉందని తెలిపారు.

## విద్యుదాఘాతంతో కూలీ మృతి

**నెల్లూరు(క్రైం), మార్చి 8**: భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి చెందిన ఘటన వేదాయపాలెంలో జరిగింది. శ్రీకాకుళం జిల్లా పాలతలగం గ్రామానికి చెందిన ముకుందరావు(32), అనూష దంపతులు. వారికి కౌషిక్, సాయి కుమారులు. ఉపాధి నిమిత్తం కొన్నేళ కిందట నెల్లూరుకు వచ్చారు. కోవూరులో నివాసం ఉంటూ నెల్లూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ముకుందరావు శుక్రవారం తన తోటి కూలీలతో కలిసి వేదాయపాలెంలో భవన నిర్మాణ పనులకు వెళ్లారు. సెల్లార్‌లో ఉన్న సవక కర్రకున్న కరెంట్‌వైర్‌ను తప్పించే క్రమంలో ముకుందరావు విద్యుదాఘాతానికి గురైయ్యాడు. సహచర కూలీల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది ముకుందరావును పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. ఆ మృతిని భార్య అనూషకు తెలియజేయడంతో ఆమె సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరైంది. భార్య ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు మృత దేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 120 |
| లేయర్ లైవ్ | 73 |
| స్కిన్ చికెన్ | 214 |
| స్కిన్‌లెస్ | 240 |
| లేయర్ | 125 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 6256 |
| వెండి కిలో ధర | రూ. 76,600 |
| వెండి ఒక గ్రాము | రూ. 78.60 |

## ఇరువర్గాల దాడిలో పలువురికి గాయాలు

**బిట్రగుంట, మార్చి 8**: బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ దళిత వాడలో రోడ్డు నిర్మాణం విషయంలో శుక్రవారం జరిగిన ఇరువర్గాల దాడిలో పలువురు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం మేరకు.. దుగ్గిరాల పెనుకొండయ్యకు 80 సెంట్ల పొలంలో మామిడి తోట ఉంది. అదే గ్రామానికి చెందిన పచ్చా వెంకట్రావు, రమేష్ తదితరులు సీసీ రోడ్డు నిర్మాణం చేసేందుకు కంప తీస్తుండగా ఇరువర్గాల మధ్య వాగ్వివాదం పెరిగి పరస్పర దాడులకు దిగడంతో పలువురు గాయాలపాలై కావలి ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. ఇదే భూవివాదంపై కోర్టులో విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ విజయప్రసాద్ తెలిపారు.



వరదలకు కుప్పకూలిన గాలిగోపురం (ఫైల్)



సోమేశ్వరుడి ఆలయ గర్భగుడి

• పెన్నమ్మ ఉగ్రరూపానికి కుప్పకూలిన గాలిగోపురం

• రెండేళ్లు గడిచినా పూర్తికాని పనులు

# శివయ్యా.. పూర్వ వైభవం ఎప్పుడయ్యా!

**అనంతసాగరం, మార్చి 8** : పెన్నమ్మ ఉగ్రరూపానికి కకావికలమైన సోమేశ్వరుడి ఆలయం నేటికీ తేరుకోలేకుంది. విక్రమాధిత్యుడి కాలంలో నిర్మించబడ్డ సోమేశ్వరుడి ఆలయం అందవిహీనంగా మారింది. 2021, డిసెంబరులో ఎగువ నుంచి సోమశిల జలాశయానికి వచ్చిన భారీ వరదలతో సోమశ్వరుడి ఆలయం దెబ్బతిన్నది. ప్రాజెక్టుకు ఉన్న 12 క్రస్ట్‌గేట్లను ఎత్తడంతో ఆలయానికి ఎడమ వైపు నిర్మించిన రక్షణ గోడపై నుంచి వరద పోటెత్తి ఆలయ ప్రాంగణాన్ని ముంచెత్తింది. దీంతో గర్భగుడి మినహా ప్రధాన నిర్మాణాలన్నీ కుప్పకూలాయి. ఎంతో పటిష్టంగా నిర్మించిన గాలిగోపురం సైతం నిట్టనిలువునా చీలి కుప్పకూలింది. ఆలయం ముందు వందేళ్ల నాటి మర్రిచెట్టు వేర్లతో సహా పెకలించుకుని వచ్చేసింది. వరద ప్రభావంతో ఆలయం ధ్వంసంకావడంపై భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ఆలయంలో తాత్కాలిక వసతులు ఏర్పాటు చేసి కాలం వెళ్లతీస్తున్నారు. ఆలయ పునఃనిర్మాణంపై పాలకుల్లో శ్రద్ధ లోపించింది. రెండు నెలల క్రితం ఆలయాన్ని అభివృద్ధి పరిచేలా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ప్రభుత్వం అందించే సహకారంతో పాటు ఎమ్మెల్యే రూ.50 లక్షలు, దాతలు మరో రూ.50 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించి, పనులకు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆలయంలో నవగ్రహ మండపం, కామాక్షి అమ్మవారి ఆలయ పనులు జరుగుతున్నాయి. ప్రధాన ఆలయ నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదు.

## ఉత్సాహంగా న్యాయవాదుల క్రికెట్



బ్యాటింగ్ చేస్తున్న న్యాయాధికారి లక్ష్మీనారాయణ

**నెల్లూరు(విద్య), మార్చి 8** : నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం న్యాయవాదుల క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను న్యాయాధికారులు లక్ష్మీనారాయణ, భరద్వాజులు ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే సిబ్బంది అందరూ మానసిక ఉపశమనానికి, నూతనో త్సహం పొందేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అందరూ కొంత సమయాన్ని కేటాయించుకుని క్రికెట్ పోటీల్లో పాల్గొనడం అభినంద నీయమని, ఇదే స్ఫూర్తిని ము న్ముందు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్, టోర్నీ నిర్వాహకులు నావూరు శ్రీధర్, దన్పాల్, రమేష్, శేషారెడ్డి, రోజారెడ్డి, పల్లమల మోహన్‌రావు, రమణారెడ్డి, బీవీ రమణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



ఎండీయూ వాహనం వద్ద క్యూ కట్టిన మహిళలు

# రేషన్ కోసం పరేషాన్

• మండుటెండలో మహిళల పడిగాపులు

**తోటపల్లిగూడూరు, మార్చి 8**: ఇంటింటికీ రేషన్ సరుకులు అందివ్వాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రారంభించిన మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ పథకం మున్నాళ్ల ముచ్చటగా మారింది. ఎండీయూ వాహనాల కొనుగులుకు వెచ్చించిన లక్షల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని, రేషన్ తీసుకోవాలంటే దుకాణానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. వివరాలిలా ఉన్నాయి. తోటపల్లిగూడూరు మండలంలో ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో 10 ఎండీయూ వాహనాలను కొనుగోలు చేశారు. అయితే మండలంలోని పలు ప్రాంతాల్లో డీలర్ల కనుసన్నల్లోనే వ్యవహారం నడుస్తుండడం గమనార్హం. మరికొన్ని ప్రాంతాల్లో వాహన డ్రైవర్లు, ఆపరేటర్లు ఇంటింటికీ వెళ్లకుండా వాహనాన్ని ఒక వీధి చివర నిలిపి సరుకులు పంపిణీ చేస్తుండడంతో వాహనాల వద్ద క్యూలో నిలబడి ఎండలో మోసుకుని రావాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. పైగా వాహనం ఎప్పుడు తమ వీధికి వస్తుందో, ఎప్పుడు రేషన్ ఇస్తారో తెలియక పనులు మానుకొని రేషన్ బండి కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండీయూ వాహనదారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.




క్రికెట్ స్టేడియం కోసం గొలగమూడి వద్ద సేకరించిన స్థలం

## నిర్మాణానికి నోచుకోని క్రికెట్ స్టేడియం

**వెంకటాచలం, మార్చి 8** : గొలగమూడి గ్రామం వద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణం మాటలకే పరిమితమైంది. ఐదేళ్ల క్రితమే స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం 50 ఎకరాలను రాష్ట్ర క్రికెట్ బోర్డుకు అప్పగించింది. అయితే ఆ భూములను ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిందంటూ గ్రామానికి చెందిన కొందరు భూసేకరణకు అడ్డుతగిలారు. అయితే, కోర్టు తీర్పుతో స్థల సేకరణ పూర్తయింది కనుక స్టేడియం నిర్మాణం త్వరలో పూర్తవుతుందని క్రీడాభిమానులు ఆశించారు. అయితే, స్థలం వద్ద బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు నిర్మాణం విష యాన్ని విస్మరించారు. దీంతో క్రీడాభిమానులు ప్రభుత్వ వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పసుపు 'ధర'హాసం.. రైతుల మందహాసం

• క్వింటం రూ. 14 వేలు • 16 ఏళ్ల తరువాత రికార్డు స్థాయిలో ధర



పసుపు తవ్వుతున్న కూలీలు (ఫైల్)



సాగులో ఉన్న పసుపు పంట

**ఉదయగిరి రూరల్, మార్చి 8**: పదహారేళ్ల తర్వాత పసుపు పంటకు రికార్డు స్థాయిలో ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా మార్కెట్‌లో పసుపు దిగుబడులకు ఆశించిన ధరలు లేవు. పసుపు పంట సాగుకు పెట్టుబడులు అధికం. దీనికి తోడు వర్షాభావ పరిస్థితులు, పంటకు తెగుళ్ల విజృంభణతో పసుపు సాగు క్రమేణా తగ్గుముఖం పడుతోంది. గత కొన్నేళ్లుగా క్వింటా పసుపు ధర రూ.4,000 నుంచి రూ.4,300 వరకు అతి తక్కువ ధర పలుకుతూ వచ్చింది. 2023 ఏప్రిల్‌లో రూ.4,600కు పెరిగింది. దీంతో చాలా మంది రైతులు పంట సాగుకు స్వస్తి పలికారు. గతేడాది రైతులు పంట విక్రయించిన అనంతరం జులై మాసంలో గుంటూరు, దుగ్గిరాల, కడప మార్కెట్‌లలో క్వింటా పసుపు ధర రూ.9,800 పలికింది. ప్రస్తుతం ఆయా మార్కెట్‌లలో క్వింటా పసుపు నాణ్యతను బట్టి రూ.13 నుంచి రూ.14 వేలు పలుకుతోంది. 2008లో క్వింటా పసుపు ధర రూ.14 నుంచి రూ.15 వేలు పలికిం దని, మరలా 16 ఏళ్ల తరువాత ఆ ధర పలుకుతోందని పసుపు పంట సాగు చేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**124.38 ఎకరాల్లో సాగు**

జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఉదయగిరి మండలంలో దశాబ్దాల నుంచి రైతులు పసుపు పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 124.38 ఎకరాల్లో పంట సాగులో ఉంది. ప్రస్తుతం రైతులు పసుపు తోటల ఆకు కోసి తవ్వకానికి సిద్ధం అవుతున్నారు. మరికొద్ది రోజుల్లో పంట దిగుబడి చేతికొస్తుంది. ప్రస్తుతం పలుకుతున్న ధరతో మంచి రాబడి వస్తుందని, గత కొన్నేళ్లుగా తాము పడుతున్న కష్టాలు తొలుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ఈ ధరలు పెరగవచ్చు లేదా తగ్గవచ్చని పలువురు వ్యాపారులు అంటున్నారు.

## విస్తృతంగా కృషి చేయండి

**అధ్యయన కేంద్రానికి నా వంతు సహాయ సహకారాలు ఉంటాయి**

**పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు**



వెంకయ్యను శాలువాతో సన్మానిస్తున్న కేంద్రం సంచాలకులు సంపత్‌కుమార్, విద్యాత్మక సిబ్బంది

**వెంకటాచలం, మార్చి 8** : తెలుగుభాషా సంస్కృతి, సంప్రదాయాలను విశిష్టంగా చాటి చెప్పేందుకు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విస్తృతంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. ఇటీవల వెంకయ్యనాయుడు పద్మవిభూషణ్ పురస్కారం స్వీకరించిన సందర్భంగా అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ శుక్రవారం వెంకయ్యను మర్యాదపూర్వకంగా వెళ్లి కలిసి శాలువాతో సన్మానించారు. ఈ క్రమంలో వెంకయ్య ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ప్రత్యేకంగా పూర్వం, ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టు వివరాలని అడిగి తెలుసుకొని కేంద్రం విద్యాత్మక సిబ్బందిని అభినందించారు. అలాగే శాశ్వత భవన నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకొని దానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. అధ్యయన కేంద్రం అభ్యున్నతికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజాజీవనంలో అసమానమైన, విశిష్టమైన సేవలు అందించి సామాజిక స్ఫూర్తిగా వెలసిన నిస్వార్థ భాషా ప్రేమికుడు వెంకయ్యనాయుడు అని సంపత్‌కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం విద్యాత్మక సిబ్బంది తదితరులున్నారు.

## నెల్లూరు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్‌గా శివయ్య



సూపరింటెండెంట్ శివయ్య

**నెల్లూరు(వెంకటేశ్వరపురం) మార్చి 8** : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ బీ.శివయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సూపరింటెండెంట్(స్టేషన్ మేనేజర్)గా విధులు నిర్వహించిన కుమార్ పదవీ విరమణ చేశారు. దీంతో రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న శివయ్యను స్టేషన్ సూపరింటెండెంట్‌గా రైల్వేశాఖ నియమించింది. బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ 11వ తేదీ నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు చేపడతానని, స్టేషన్‌ని శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకొనేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## డీసీసీబీ విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యుటీ బకాయిలు విడుదల



గ్రాట్యుటీ బకాయిల చెక్కును అందచేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**నెల్లూరు(హరనాథపురం), మార్చి 8** : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశ్రాంత ఉద్యోగులకు గ్రాట్యుటీ బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. దీంతో దశాబ్దాల డీసీసీబీ ఉద్యోగుల సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ఎన్‌డీసీసీబీ ఉద్యోగులకు ప్రభుత్వం గ్రాట్యుటీ బకాయిలు రూ.1.05 కోట్లు విడుదల చేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సహకార బ్యాంకు రిటైర్డు ఉద్యోగుల గ్రాట్యుటీ బకాయిలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల సమస్యకు ముఖ్యమంత్రి పరిష్కారం చూపించి రిటైర్డు బ్యాంకు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి ఉద్యోగులకు కొత్త వేతన స్కేలు అమలు చేస్తూ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు, డీజీఎంలు దయాకర్‌రెడ్డి, మధుసూదన్, డైరెక్టర్లు నర్మల రమణయ్య, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, బ్యాంకు రిటైర్డు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతం చెల్లించరా..?

• జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది నిరీక్షణ

• నాలుగేళ్ల క్రితం మూడు నెలల బకాయిలు

• నెరవేరని మంత్రుల హామీలు?

'మీ వేతనాలకు ఎలాంటి ఢోకా లేదు. మీకు మేము హామీ ఇస్తున్నాము. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వెంటనే బకాయిలు చెల్లించేలా అధికారులకు ఆదేశాలిస్తాం.' ఇది నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సెక్యూరిటీ సిబ్బందికి నాలుగేళ్ల క్రితం నాటి రాష్ట్ర మంత్రులు ఆళ్ల నాని, అనిల్‌కుమార్ యాదవ్ ఇచ్చిన హామీ. ఇప్పటికీ ఈ హామీ నెరవేరకపోవడం గమనార్హం.

**నెల్లూరు (వైద్యం), మార్చి 8** : ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూ రిటీ గార్డుల వేతన బకాయిలు నాలుగేళ్లుగా చెల్లింపునకు నోచుకోవడం లేదు. ఇక్కడ 134 మంది సెక్యూరిటీ గార్డులు పనిచేస్తున్నారు. 2019లో తిరుపతికి చెందిన బాలాజీ సెక్యూరిటీ ఏజెన్సీస్ ఈ సెక్యూరిటీల నిర్వహణ చేపట్టేది. అయితే అదే ఏడాది సెప్టెంబరు నెలతో ఆ ఏజెన్సీ కాల పరిమితి పూర్తయినా సెక్యూరిటీ గార్డులు కొనసాగుతూనే ఉన్నారు. 2020లో సాలమన్ ఏజెన్సీకి సెక్యూరిటీ బాధ్యత అప్పగించారు. అయితే 2019 అక్టోబరు, నవంబరు, డిసెం బరు మాసాలకు సంబంధించి మూడు నెలలు ఏ ఏజెన్సీ సెక్యూరిటీ బాధ్యతలు అప్పగించ లేదు. దీంతో జీజీహెచ్ ఆ వేతనాలు చెల్లించాల్సి ఉంది. 2020 ఫిబ్రవరి నెలలో జీజీహెచ్‌ను నాటి వైద్య శాఖ మంత్రి ఆళ్ల నాని, నీటి పారుదల శాఖమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సందర్శిం చారు. సెక్యూరిటీ గార్డుల వేతన బకాయిల విషయం తెలు సుకుని వెంటనే జీతాలివ్వాలని అధికారులను ఆదేశించారు. అయితే ఇప్పటికీ వేతనాలు చెల్లించలేదు. మొత్తం 134 మంది సెక్యూరిటీలకు అప్పట్లో ఇస్తున్న జీతం రూ.8600 మేరకు రూ.34.57 లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాటిని చెల్లించాలని సెక్యూరిటీలు కోరుతున్నారు.

# హరహర మహాదేవ్

● శివాలయాల్లో పోటెత్తిన భక్తులు ● ఘనంగా మహాశివరాత్రి

నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను భక్తులు, నిర్వాహకులు, ఆలయపూజారులు వైభవంగా నిర్వహించారు. ముందుగా నదీ జలాల తో అభిషే కం చేసి ప్రత్యేక పూజలు.. శివపా ర్వతులకు కల్యాణం చేశా రు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని రాత్రంతా జాగరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహ కులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**ఆత్మకూరు, మార్చి 8:** అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కవిత దంపతులు, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. తిరునాళ్ళతిప్ప కాశీనాయన ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేశారు. కాలభైరవుని విగ్రహం ఆకట్టుకుంది. భూదేవి శ్రీదేవి సమేత అలఘనా థస్వామి, వెంకటేశ్వరస్వామి, కన్య కాపరమేశ్వరి, అభయాంజనేయస్వామి, శ్రీనివా సేశ్వరస్వామి, శ్రీషిర్డిసాయిబాబా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణతో అలంకరించారు.



కందుకూరులో..

**సంగం:** సంగమేశ్వరాలయంలో తెల్లవారు జామున పినాకినీ నది నుంచి మేళతాళాలతో జలాలు తీసుకొచ్చి క్షీర, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మాత్ర శ్రీశారదమ్మతో శ్రీ మద్భగవద్గీతా పారాయణం చేశారు. ఆల యంలోని పాతాళగంగ శివలింగానికి, వంగల్లు భీమేశ్వరుడు అర్ధరాత్రి నం దివాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం స్వామి కల్యాణం జరిగింది. తిరుమనకొండపై వెలసి ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో అభిషేకాలు, హోమంతో చేపట్టారు. సంగం మెయి న్ బజార్‌లోని అంజనేయస్వామి ఆలయంలో, గాంధీ జనసంఘంలోని చం ద్రమౌళేశ్వరాలయాలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కామాక్షిదేవి భీమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు గజ పూలమాలలతో అలంకరించారు.

**అనంతసాగరం:** చిలకమర్రి మల్లెంకోడేశ్వరాలయం, సోమశిలలోని శివాలయాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు ఆనం రామనారాయణ రెడ్డి దర్శించారు. కామిరెడ్డిపాడు దుర్గమ్మ ఆలయం, చికలమర్రి లోని మల్లెం కొండేశ్వరుని ఆలయం, సోమశిలలోని వేడుకలు ఘనంగా జరిగాయి. మల్లెం కొండేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

**దుత్తలూరు (ఉదయగిరి రూరల్):** కొండపై వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామికి మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర రెడ్డి, నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌లు, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శాంతికుమారిలత పూజలు చేశారు. నందిపాడు, కొత్తపేట, బ్రహ్మేశ్వరం, నర్రవాడ, ఏరుకొల్లు, రాచవారిపల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**ఏఎస్ పేట:** చిరమన కామాక్షిదేవి చంద్రమౌళీశ్వర స్వామికి నిర్వాహకులు కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, నరసింహరెడ్డి దంపతులు పూజలు చేశారు. .

**కలువాయి:** రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామికి వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలువాయి మాజీ సర్పంచు చల్లా ఇందిర, రఘురామిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

**సీతారామపురం:** తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్ ఘటిక సిద్దేశ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భైరవకోన శివాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాజీ శాసన సభ్యులు ఉగ్ర నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

**ఉదయగిరి:** లింగాలదొన, కాశినాయన, గండిపాళెం, ఉదయగిరి ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్టీసీ డిపో అధికారులు నారాయణస్వామి, సిద్దేశ్వరం, భైరవకోన ప్రాంతాలకు బస్సులను నడిపారు.

**వరికుంటపాడు:** మండలకేంద్రంతో పాటు పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు, నారసింహాపురంల్లో భక్తులు గోత్రనామాల తో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ వరికుంటపాడు ఆలయంలో స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

**చేజర్ల:** కాకివాయి హంసరామ స్వామి ఆశ్రమం, చిత్తలూరు వీరభద్రస్వామి ఆలయం, చేజర్లలోని శివాలయాలలో వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణ రెడ్డి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కావలిటౌన్:** వెంగళరావునగర్‌లోని శివాలయం, ముసునూరు హను మత్ క్షేత్రం, పాతూరు ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. కావలి నటరాజ , నెల్లూరు చెన్నకేశవ నాట్యమండలి సభ్యులు నాటకాలు ప్రదర్శించారు.



లింగసముద్రం కోటయ్యస్వామి మందిరం వద్ద భక్తులు



ఉదయగిరి రూరల్ : రామలింగేశ్వరస్వామి సన్నిధిలో కాకర్ల సురేష్



చిత్రగుంట : శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**కందుకూరు:** స్కందపురి సోమేశ్వరాలయంతో పాటు జనార్ధనస్వామి ఆలయం, కనిగిరి రోడ్డులోని అయ్యప్పస్వామి, కందుకూరు అంకమ్మ ఆలయాలలో మహిళలు ఉపవాస దీక్షలు చేశారు. కందుకూరు సమీపంలోని మన్నేటికోట, లింగసముద్రం, మొగిలిచర్ల, సంగమేశ్వరం, జమ్ములపాలెం క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది.

**అల్లూరు:** నార్తుమోహూరు, ఇస్కపల్లిల్లోని, అల్లూరు శివాలయాల్లో పూజలు నిర్వహించారు. ఇస్కపల్లిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి రుద్రాభిషేకం, క్షీరాభిషేకాలు చేపట్టారు. పూజల్లో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, సుజన దంపతులు పాల్గొన్నారు.

**లింగసముద్రం:** మండలకేంద్రంతో పాటు మొగలిచెర్లలోని తిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరం, మొగిలిచెర్లలోని దత్తాత్రేయస్వామి ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కనిగిరి ఎమ్మెల్యే, కందుకూరు వైసీపీ సమయ్వకర్త బుర్రా మధుసూదనయాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ అన్నసంతర్పణ కమిటీ, అయ్యప్పస్వామి, దత్తాత్రేయస్వామి ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కందుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింగసముద్రం టీడీపీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ పాల్గొన్నా రు. శ్రీ సత్యానంద కొట్టె వెంకయ్య శిష్య బృందం, నల్గొండ వారి వీఎంఆర్ వారు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

**వలేటివారిపాలెం:** అయ్యవారిపల్లెలో పాలేటి కొండయ్య తాత ఆలయంలో ఇంటూరి నాగేశ్వరరావు పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, వలేటి నరసింహం, ఎం. కొండలరావు పాల్గొన్నారు.

**కలిగిరి:** పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, సిద్దనకొండూరు సిద్దేశ్వరస్వామి ఆలయాలు ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**చిత్రగుంట:** రైల్వే ఎల్సీగేట్ 143 సమీపంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం, విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలోని విఘ్నేశ్వర రామలింగేశ్వరస్వామికి, నాగులవరం గంగాపార్వతి నాగలింగేశ్వరునికి అభిషేకాలు చేశారు.

**వింజమూరు :** పట్టణంలోని శివాలయంలో అయ్యప్పస్వామి, వీరబ్రహ్మేంద్ర పోతులూరి స్వామి గుడిలో ఉత్సవాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి గుడిలో శివపార్వతులకు కళ్యాణం నిర్వహించారు. అలాగే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహిం చారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా సంక్రాంతి రమణయ్య, వెంకటరమణ దంపతులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



కలువాయి: స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



ఆత్మకూరు: కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



అనంతసాగరం: మల్లెంకొండేశ్వర స్వామి పూజలో పాల్గొన్న ఆనం

## మహనీయుల విగ్రహాల నిర్మాణాలకు విరాళం

**సీతారామపురం:** ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయిపూలే, బాబు జగ్జీవన్‌రాం, గుర్రం జాషువా, మదర్ థెరిసా, అబ్దుల్‌కలాంల విగ్రహాల నిర్మాణ సముదాయానికి నియోజకవర్గ సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తనయుడు మేకపాటి అభినవ్ రెడ్డి రూ.2.5లక్షల విరాళం ప్రకటించారు. శుక్రవారం దుత్తలూరులోని పార్టీ కార్యాలయంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు కలివెల ఎలీషా కుమార్‌కు ఈ నగదు చెక్కును అందజేశారు.

## బీసీ డిక్లరేషన్‌పై హర్షం

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్‌పై నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి, వాల్మీకి సాధికార కన్వీనర్ చల్లా ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఉండే వాల్మీకులను మాత్రమే ఎస్టీలుగా గుర్తించాలని కేంద్రానికి నివేదిక పంపడం దారుణమన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకే రాష్ట్రం ఒకే రిజర్వేషన్లలో భాగంగా వాల్మీకులను ఉత్తరాంధ్ర మాదిరిగా ఎస్టీలుగా గుర్తిస్తామని బీసీ జయహో సభలో చంద్రబాబు, పవన్‌లు ప్రకటించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## మదారాబాదు పోస్టాఫీస్‌ను మార్చొద్దు

● గ్రామస్థుల నిరసన

**ఏఎస్ పేట, మార్చి 8:** మదారాబాదులోని పోస్టాఫీస్‌ను ఇతర గ్రామానికి మారుస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామంలో 1959లో ఏర్పాటు చేశారని అప్పటి నుండి గ్రామస్తులు సేవలను వినియోగించుకుంటున్నామని చెప్పారు. రవాణా సౌకార్యం లేని గ్రామంలో పోస్టఆఫీస్ ఉండడంతో మహిళలు, వృద్ధులు ఖాతాలు తెరిచి నగదు లావాదేవిలు జరుపుతున్నట్లు ఇపుడు పోస్టఆఫీస్ మారిస్తే ఇబ్బందులు పడతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

## శుద్ధిజల కేంద్రానికి మరమ్మతు చేయాలని వినతి

**ఉదయగిరి రూరల్, మార్చి 8:** మండలంలోని బిజ్జంపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఉన్న శుద్ధిజల కేంద్రానికి మరమ్మత్తులు చేయించి ప్రజలు, విద్యార్థుల తాగు నీటి కష్టాలు తీర్చాలని శుక్రవారం కొట్టాలు గ్రామానికి వచ్చిన నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య ఆధ్వ ర్యంలో కృష్ణారెడ్డిపల్లి, బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన శుద్ధిజల కేంద్రానికి మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు.

## 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**సీతారామపురం:** స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-2025 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ముజీబుర్ రెహమాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించి పాఠశాల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోడల్ స్కూల్‌లో 5వ తరగతి సిలబస్‌తో తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

## ఆత్మకూరులో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

**ఆత్మకూరు, మార్చి 8:** పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు ఏళ్ల తరబడి రోడ్డు విస్తరణ పనులు చేట్టాలని సీపీఎం నాయకులు శుక్రవారం పట్టణంలోని ఎల్ ఆర్‌పల్లి వద్ద సంతకాల చేపట్టిన సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ షేక్ సందాని తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

## వైసీపీ పరిశీలకుడిగా బొమ్మిరెడ్డి

**ఉదయగిరి:** నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిగా బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిని నియమించారు. గతంలో ఈయన నెల్లూరు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్‌గా పని చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం నియమించినట్లు ఓ ప్రకటన విడుదల చేసింది.



### నేడు నారీశక్తి ఫిట్‌నెస్ రన్

**కలిగిరి :** స్థానిక కస్తూర్బా విద్యాలయంలో శనివారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం నెల్లూరు వారి సహకారంతో నారీశక్తి ఫిట్‌నెస్ రన్, నారీశక్తి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజాసత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

వీర మాతలకు సత్కారం



కావలిటౌన్ : సత్కారమందుకుంటున్న కోవిడ్ వారియర్స్ తల్లులు



కందుకూరు : టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొన్న నాగేశ్వరరావు, మహిళలు

కావలిటౌన్, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. రెడ్‌క్రాస్ భవనంలో మహిళా రెడ్‌క్రాస్ కన్వీనర్ స్వర్ణలత పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో కోవిడ్ వారియర్స్ తల్లులను సత్కరించారు. టీంసేవియర్స్ మహిళా విభాగం అధ్యక్షురాలు కీర్తిప్రియ అధ్యక్షతన వీరమాతకు వందనం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాస్టర్స్ అంతర్జాతీయ అథ్లెట్ కోటేశ్వరమ్మ పాల్గొని వీరమాతలను సత్కరించారు. డాక్టర్ నళినీపద్మ, అభయం శ్రీవాణి, సక్లం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

● విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ పర్యవేక్షణలో జరిగిన మహిళా దినోత్సవం వేడుకల్లో ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ పాల్గొని నారీశక్తి విశిష్టత గురించి వివరించారు విద్యార్థినుల ఆటపాటలు అలరించాయి.

● పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో విశ్రాంత మహిళా పెన్షనర్స్ పాల్గొని వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కేక్ కట్ చేసి మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి అలేఖ్య, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, తెలుగుదేశం, అనుబంధ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

**జగనన్న పాలనలో బడుగు వర్గాల మహిళల అణచివేత**

**చిత్రగుంట :** జగనన్న పాలనలో బడుగు వర్గాల మహిళలను అణిచివేశారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి శుక్రవారం అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇళ్లలో పనులు చేస్తున్న తుపాకుల శాంతమ్మ, మాణికల రమణమ్మలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ఛైర్మన్ తుపాకుల పొట్టెయ్య, చెంచయ్య, మానికల వెంకయ్య స్థానికులు పాల్గొన్నారు.

**కందుకూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు అనేక ప్రోత్సాహకాలు లభించనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంటూరి సౌజన్య, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కేకు కట్‌చేసి వేడుకలు జరిపారు. సాంస్కృతిక శాఖ నుంచి జి కామేశ్వరమ్మ, కార్మిక శాఖ అధికారి ఆర్ పద్మ, డాక్టరు శర్మిష్టరెడ్డి, మాజీ ఎంపీపీ పొడపాటి సుజాత, ఆర్టీసి కండక్టర్ శ్రీదేవి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలోని మహిళా ప్రతినిధులను సత్కరించారు.

● శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా హాస్పటల్‌లో పనిచేస్తున్న మహిళా డాక్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు చక్కా వెంకటకేశవరావు, రవ్వా శ్రీనివాసులు, ఇన్నమూరి శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**బాలికలు అన్నిరంగాలలో ముందుండాలి**

బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని పలువురు పేర్కొన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఉపాధ్యాయినుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయం వద్దఉన్న బాలికల వసతిగృహంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని బాలికలకు అట్టలు, పెన్నులు, పౌచ్‌లను హిందీ ఉపాధ్యాయురాలు సమత బహుకరించారు. అనంతరం బాలికల వసతిగృహం మేట్రన్ రమాదేవి, సమతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కట్టా సుచరిత, బండి ధనమ్మ, జ్యోతి, షర్మిల, సుభాషిణి, బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె మోహనరావు, షేక్ అబ్దులా పాల్గొన్నారు.

**వింజమూరు:** పట్టణంలోని మాసిలామణి హాస్పిటల్‌లో డాక్టర్ తిప్పిరెడ్డి రశ్మిని డాక్టర్ మాసిలామణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలకు అంబేద్కర్ ఓటు హక్కు కల్పించారని దాని ద్వారా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏ హాస్పిటల్ అధినేత రాజశేఖర్‌రెడ్డి, మాసిలామణి హాస్పిటల్ ఛైర్మన్, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



వింజమూరు: సభలో మాట్లాడుతున్న డాక్టర్ మాసిలామణి





వసతిగృహం మేట్రన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయినులు

## డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నజడ్పీటీసీ

**కలిగిరి, మార్చి 8:** స్థానిక సీసీకేఆర్ నగర్‌లో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను జడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో కలిగిరి సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి, పుల్లా రవి, రఘురామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధం సభకు తరలిన పోలీసులు

**లింగసముద్రం, మార్చి 8:** మహాశివరాత్రి పండుగ సందర్భంగా శుక్రవారం లింగసముద్రంలోని శ్రీ తిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరం వద్ద, మొగిలిచెర్లలోని శ్రీ దత్తాత్రేయస్వామి దేవాలయం వద్ద జరిగే తిరునాళ్ళ పర్యవేక్షణకు కేవలం ఐదుగురు పోలీసులు, నలుగురు వాలంటీర్లు, ఐదుగురు ప్రైవేటు సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్నారు. కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు ఈనెల 10న మేదరమెట్లలో జరిగే సిద్ధం సభకు తరలి వెళ్లారు. దీంతో ఈ రెండు దేవాలయాల వద్ద, అలాగే ట్రాఫిక్ నిర్వహణకు పోలీసుల కొరత ఏర్పడింది. ప్రతిఏటా ఈ పండుగకు సుమారు 100 మంది నుంచి 150 మంది వరకు విధులు నిర్వహించేవారు.కానీ ఉన్నతాధికారులు కేవలం నామమాత్రంగా పోలీసులను నియమించడంపై భక్తులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

## రాక్షస పాలన అంతం టీడీపీ-జనసేన లక్ష్యం : కావ్య

**కావలి, మార్చి 8:** రాష్ట్రంలో రాక్షసపాలన అంతమొందించేందుకే టీడీపీ - జనసేన ఉమ్మడి పోరాటం చేస్తున్నాయని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ, జనసేన నేతలు నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పట్టణ, మండలస్థాయి నాయకులు పాల్గొని ఎన్నికల ప్రచారం గురించి వివరించారు. రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు కలిసి పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో టీడీపీ అభ్యర్థి క్రిష్ణారెడ్డి గెలుపుకు కృషి చేయాలన్నారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తానని టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పదేళ్లగా ఎమ్మెల్యేగా ఉండిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి అభివృద్ధికి ఏమి చేశాడో ఒక్కసారి ప్రజలు ఆలోచించాలన్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మైండ్‌గేమ్ ఆడుతూ జనసేన నేతలు, జనసైనికులను ప్రలోభపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అన్నారు. అందరం సమిష్టిగా పనిచేసి కావలిలో క్రిష్ణారెడ్డిని గెలిపిద్దామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పరిశీలకుడు బొమ్మి సురేంద్ర, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, మొగిలి కల్లయ్య, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, వైసీపీ నేతలు పొబ్బసాయి, రుషికేష్, ఆలా శ్రీనాద్, సుదీర్ తోపాటు కావలి నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ, వైసీపీ అధ్యక్షులు, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి

**మదీనా మసీదులో ప్రార్థనలు**

కావలి వైకుంఠపురంలోని మదీనా మసీద్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రార్థనలలో ముస్లీం సోదరులతో కలిసి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లీం సోదరులు కావ్య క్రిష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని దువా చేశారు. అనంతరం మసీద్ కమిటీ విన్నపం మేరకు మసీద్ అభివృద్ధికి రెండున్నర లక్షల విరాళం కావ్య ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ముస్లీంలకు కమ్యూనిటీ హాలు, 10 ఎకరాలలో శ్మశాన వాటిక ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. రానున్న ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**కందుకూరు, మార్చి 8:** వలేటివారిపాలెం మండలం కళవళ్ల గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు రూ. 201116 విరాళంగా అందజేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులు మన్నం అయ్యప్పనాయుడు, స్వర్ణ మాధవరావు, పచ్చవ శ్రీనివాసులు, గౌరనేని సత్యనారాయణ తదితరులకు ఈ మొత్తాన్ని అందించారు.

## విష్ణుతో కలసి పనిచేసేందుకు సిద్ధం : బీద రవిచంద్ర

**అల్లూరు, మార్చి 8:** మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో కలసి పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. అల్లూరు మండలం ఇస్కపల్లిలో శుక్రవారం ఆయన మండలంలోని గ్రామీణ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామని, అదేవిధంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్టీలో చేరడం అదనపు బలాన్నిచ్చిందన్నారు. కావ్య కృష్ణారెడ్డి గెలుపునకు అన్నివిధాలా సంసిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, అంబటి రాజేంద్ర, గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న బీద రవిచంద్ర

**వేసవిలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి**

**కొండాపురం, మార్చి 8:** వైసవిలో ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కావలి పట్టణానికి చెందిన మాలినీదేవి మల్టీస్పెషాలిటీ వైద్యశాల వైద్యురాలు గొట్టిపాటి మాలినీదేవి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాయిపేటలో సామాజిక కార్యకర్త భీమిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన మహిళలకు వివిధ రకాల పరీక్షలుచేసి మందులను అందచేశారు. అంతకుముందు కామ్రేడ్ గంటా లింగయ్య విగ్రహానికి, వైద్యురాలు మాలినీదేవి తాత తల్లపనేని అంకయ్య చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వైభవంగా మహాశివరాత్రి


కోవూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


తోటపల్లిగూడూరు, శివాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు


పొదలకూరు, భక్తులతో రద్దీగా మారిన శివాలయం వీధి


మనుబోలు కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 8 :** నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు జరిగాయి. అనంతరం గిన్నెభిక్ష ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. రాజరాజేశ్వరి అమ్మవారికి విశేషంగా రాహుకాల పూజలు, నిత్య పూజలు ప్రత్యేక అలంకారం కనుల పండువగా జరిగాయి. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవలు, రాత్రి లింగోద్భవ అభిషేకాలు, రాత్రి నందివాహనంపై మీనాక్షి సుందరేశ్వరస్వామికి మంగళవాయిద్యాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి కుటుంబంతో వచ్చి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా అల్లూరు సులోచనమ్మ, అల్లూర గిరీష్‌రెడ్డి కుటుంబం వ్యవహరించింది. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, ప్రధాన అర్చకులు రఘురామస్వామి, సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు. అలాగే మూలాపేట నీలకంఠేశ్వర స్వామి, వీరభద్ర స్వామి ఆలయం, నవాబుపేట మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయాలతోపాటు సుజాతమ్మనగర్ ఉమాదేవీ నాగేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.


నెల్లూరులో...



## సైకత లింగానికి పూజలు

**నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 8 :** మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పెన్నానదిలో సైకత లింగానికి శివరాత్రి పూజలు జరిగాయి. పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మునీంద్రస్వామి, శేషస్వామి, బుజ్జయ్యస్వామి, నాగేంద్రస్వాములు అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను అసోసియేషన్ అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, సభ్యులు పర్యవేక్షించారు.

**● కనుల పండువగా శివపార్వతుల కల్యాణం**

నగరంలోని మైపాడురోడ్డు వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ముప్వా ప్రసాద్ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. రాత్రి లింగోద్భవం, శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది.

● పొదలకూరురోడ్డులోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో 3 టన్నుల కట్టెలతో రుద్రహోమం వైభవంగా జరిగింది.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో భవానీ శంకరస్వామికి, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, లింగోద్భవ అభిషేకాలు, జాగారణలు జరిగాయి.


సైకత లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

**కోవూరు:**
శివరాత్రి సందర్భంగా శుక్రవారం స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయం, వేగూరులోని కైలాసనాథస్వామి ఆలయం, మోడేగుంటలోని నాగేశ్వరస్వామి ఆలయం, పాటూరులోని సిద్ధేశ్వరాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోతిరెడ్డి గ్రామ శివారుల్లోని పెన్నానది తీరాన వెలసిన జలధార పరమేశ్వరస్వామి లింగానికి మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో శివరాత్రి జాగరణ చేశారు.

**తోటపల్లిగూడూరు:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాటేపల్లి శివాలయం భక్తులతో శుక్రవారం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల క్రమబద్ధీకరణకు పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణపట్నం పోర్టు సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం భక్తులకు ప్రసాదాలను అందజేశారు. కోడూరు శివాలయానికి సముద్రతీరం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**సైదాపురం:** సిద్దేశ్వర కోనలోని సిద్దులకు అభిషేకం, శివపార్వతుల కల్యాణ మహోత్సవం. దక్షిణామూర్తి ఆలయంలో పుష్ప యాగం, సైదాపురం, పోతేగుంట, తుమ్మలతలుపూరు, కలిచేడు గ్రామాల శివాలయాల్లో విశేష పూజలు చేశారు.

**ముత్తుకూరు:** సిద్ధేశ్వరస్వామి దేవస్థానాన్ని పునర్నిర్మాణం చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కృష్ణపట్నంలోని మనుమ సిద్ధేశ్వరస్వామి దేవస్థానంలో మంత్రి కాకాణి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కుమార్తె పూజితరెడ్డి, వైసీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు. నాగలింగేశ్వరస్వామి ఆలయంలో గొలగ మూడి ఆశ్రమ కమిటీ సభ్యులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా భక్తులకు అన్నదానం చేశారు. బ్రహ్మదేవంలోని కైలాసనాధేశ్వర స్వామి ఆలయంలో వైసీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కొత్తపల్లి రమేష్‌శర్మ ఆధ్వర్యంలో చేసిన చందనాలం కారంతో స్వామివారు భక్తులను ఆకట్టుకున్నారు. ఈపూరులోని విరూపాక్ష స్వామి ఆలయం, పైనంపురంలోని భోగేశ్వరస్వామి దేవస్థానం, వల్లూరు శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.


సైదాపురం: సిద్దేశ్వర కోనలో శివ పార్వతుల కళ్యాణం

**పొదలకూరు:**
పట్టణంలోని చోళులకాలం నాటి పురాతన శివాలయంతోపాటు డేగపూడి, చెన్నారెడ్డిపల్లి, విరువూరు, బిరద వోలు, అయ్యగారిపాలెం శైవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం దేదీప్యమానంగా ప్రకాశించింది. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రాంబాబు, ఎస్ఐ డి.రామకృష్ణ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

**మనుబోలు:** మండలంలోని బద్దెవోలు క్రాస్ రోడ్డు సమీపంలోని శ్రీకామాక్షితాయి సంగమేశ్వర స్వామి దేవస్థానంలోఅర్చకులు ఫణీంద్ర శర్మ సంగమేశ్వ రుడికి రుద్రాభిషేకం పంచామృత అభిషేకం, కామాక్షిదేవికి కుంకుమార్చనను నిర్వహించారు. శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణంలో జెట్టి సురేంద్ర, పవిత్ర దంపతులు పాల్గొన్నారు. మనుబోలు యూత్ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వేలాదిగా స్వామివారిని దర్శించుకొని కళ్యాణమహోత్సవాన్ని తిలకించి భక్తులు ఆనంద భరితులైనారు.

**విడవలూరు:** మండలంలో శివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రామతీర్థం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. వేకువ జామున సముద్ర స్నానాలు ఆచరించిన భక్తులు సైకత శివ లింగాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆనంతరం స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని ఆభిషేకాలు చేశారు. పార్లపల్లి శివాలయంలో జరిగిన వేడుకల్లో గ్రామ సర్పంచు రామిశెట్టి స్వాతీ, వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొని పూలంగి సేవ నిర్వహించారు. ఆనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

### ● కిక్కిరిసిన జొన్నవాడ

**బుచ్చిరెడ్డిపాళెం :** జొన్నవాడలో స్వయంభువు మల్లికార్జునస్వామికి అర్ధరాత్రి నుంచే లింగోద్భవ పూజలు జరిగాయి. ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారికి పాలు, పంచామృత అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆదిదంపతులు పెద్ద వెండినంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గంగా, కామాక్షి సమేతుడిగా మల్లికార్జునస్వామివారికి నిత్యకల్యానం జరిగింది. భక్తులు బారీగా తరలిరావడంతో జొన్నవాడ కిక్కిరిసిపోయింది. ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఈఓ వి.గిరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు. బుచ్చిలోని శివాలయం, బాబా మందిరం, దర్గాదేవి, దుర్గామల్లేశ్వరాలయం, దామరమడుగు, కాళాయకాగొల్లు, మినగల్లు, పెనుబల్లి, మునులపూడి, పంచేడులోని శివాలయాలు, బాబా, వెంకయ్యస్వామి మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. కాగా, కామాక్షితాయి సన్నిధి వీధిలో ప్రభుత్వ వైద్యఆరోగ్య, ఆయుష్ శాఖ వైద్యాధికారులు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అహ్మద్‌బాబు ఆధ్వర్యంలో వైద్యసేవలు అందాయి. నెల్లూరు వాసవీ ఐ కేర్ వైద్యులు కూడా పాల్గొన్నారు.

## కమనీయం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



**నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 8 :** నగరంలోని విరాట్‌నగర్‌లో వెలిసి ఉన్న గాయత్రి సమేత విశ్వకర్మ గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం అభిషేకాలు, విశేష అలంకారాలు, హోమాలు జరిగాయి. అనంతరం గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిలకు కల్యాణం మహోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాలను పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం పర్యవేక్షించింది.

**● సహస్రలింగాల సూక్ష్మ శివలింగం**

మూలాపేటకు చెందిన తెలుగు టీచర్, సూక్ష్మ శిల్పాల సృష్టికర్త గంధవళ్ల ఉమాశం కర్ సూక్ష్మ శివలింగంలో సహస్ర లింగాలను చెక్కి ఆవిష్కరించారు.



## హనుమంతుడిపై శ్రీవారి వైభోగం

**బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 8:** బుచ్చిరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా హనుమంత వాహనంపై బుచ్చి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఇనుగూరు సుబ్బారావు, సత్యవోలు బుజ్జమ్మ కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించారు.


బుచ్చి పురవీధుల్లో ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరుడు

### 11న శాయాజీరావు గైక్వాడ్ జయంతి

**నెల్లూరు(సాంస్కృతికం) :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కి చదువు చెప్పించిన బరోడా మహారాజ్ శాయాజీరావు గైక్వాడ్ జయంతిని ఈనెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అంబేడ్కర్ మిషన్ వర్కింగ్ చైర్మన్ వై.రామకృష్ణయ్య, ప్రధానకార్యదర్శి టి.పవన్‌కుమార్, చైర్మన్ కె.తిరువళ్లూరులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాటాడుతూ ఈ కార్యక్రమం అంబేడ్కర్ భవన్‌లో జరుగుతుందని

# అట్టహాసంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**నెల్లూరు(విద్య), మార్చి 8 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నెల్లూరులో పలు విద్యాసంస్థలు, ఉపాధ్యాయ సంఘాలు, క్రీడాసంఘాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా వాకర్స్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వాకర్స్ కోఆర్డినేటర్ బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి నసీర్ అహ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్.ఉషారాణి పాల్గొని ఉపాధ్యాయినిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, మహిళా నేతలు మెహిసినా సుల్తానా, ఎం.సులోచనమ్మ, విజయభారతి, గౌరి, పద్మజ, సుధారాణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.సురేంద్ర రెడ్డి, పిచ్చిబాబు పాల్గొన్నారు.

● బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని జగజ్జీవన్‌రావు భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయినిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మణిసుబ్బు, మాసా ప్రసాద్, మహిళా నేతలు భాగ్యమ్మ, మేరీస్టెల్లా, స్వరూపరాణి, తదితరులు పాల్గొన్నారు.

**రెడ్‌క్రాస్‌లో...**

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) :** చిరంజీవి యువత ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. జనసేన పార్టీ వీర మహిళ నాగరత్నం పలువురు మహిళలను శాలువాలతో సత్కరించి, కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రవికుమార్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర కార్యదర్శి సుందరరామిరెడ్డి, నాయకులు గుడి హరికుమార్‌రెడ్డి, గంగిశెట్టి నరసింహా, వీరమహిళలు నందినీయాదవ్, కస్తూరి, పాల్గొన్నారు.

**నెల్లూరు(వెంకటేశ్వరపురం) :** ఆంధ్రప్రదేశ్‌లో ఈ అరాచక పాలనను తరిమికొట్టేందుకు మహిళలు ఉద్యమించాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా 47 డివిజన్‌లో మహిళలను సన్మానించాడు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుజాతరావు, మహిళలు కామేశ్వరమ్మ, వజ్రావతమ్మ, రమణి, తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు(వ్యవసాయం) :** నెల్లూరు ఏఎంసీ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఏఎంసీ చైర్మన్ పెర్నేటి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా చీరలు, స్వీట్లు పంపిణీ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంసీ వైస్ చైర్మన్ ఒట్టూరు సుధాకర్‌యాదవ్, డైరెక్టర్ తాటిపర్తి వెంకటేష్, కార్యదర్శి నవీన్, కా ర్యాలయ యుడిసి రమేష్ పాల్గొన్నారు.

**నెల్లూరు(సాంస్కృతికం) :** నగరంలోని టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో ఒమెగా ప్రీమియర్ మిస్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ దంత వైద్యశాల ప్రిన్సిపాల్ అజయ్‌రోనాల్, మిస్టీ చైర్‌పర్సన్ డాక్టర్ గ్లోరీ, ఏ.జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాచలం :** టీడీపీ మహిళా విభాగం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జే హేమలత, జిల్లా కార్యదర్శి ఉప్పు చెత్తమ్మలతో కలిసి టీడీపీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు దువ్వూరు లక్ష్మమ్మ మహిళా దినోత్సవం కట్ చేశారు. కార్యక్రమంలో నిర్మల, డీమేరీ, ఎల్.తిరుపతమ్మ, పీ.కళ్యాణి తదితరులున్నారు.

**పొదలకూరు :** మండల, పట్టణ, యువజన ఆర్యవైశ్య సంఘం నేతలు పొదలకూరు సర్పంచు మల్లికా చిట్టెమ్మ, మాజీ సర్పంచు గోను శ్యామలమ్మ, వార్డు సభ్యురాలు ఆకులూరు వెంకట అనురాధ, మాజీ వార్డు సభ్యులు ఆకులూరు ప్రసన్నలక్ష్మి, గుర్రం శైలజలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రూరల్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి పొట్టి సుధాకర్, జిల్లా రూరల్ యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజాసురేంద్ర బాబు, ఉపా ధ్యక్షుడు కృష్ణం వెంకటరమణయ్య, మండల అధ్యక్షుడు తన్నీరు సురేష్‌బాబు, పట్టణ అధ్య క్షుడు గుర్రం మీరా మధు పాల్గొన్నారు.


బీటీఏ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు



రెడ్‌క్రాస్‌లో చిరంజీవి యువత, జనసైనికులు..


వెంకటాచలం : కేక్ కట్ చేస్తున్న మహిళలు


పొదలకూరు : మహిళను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

## ఎనెల్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవం

**నెల్లూరు(వైద్యం), మార్చి 8 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని ఎనెల్ ఆసుపత్రిలో శుక్రవారం డాక్టర్ హరితకుమరి, డాక్టర్ హారిక, డాక్టర్ సంధ్య, డాక్టర్ తేజస్వీలు కేట్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కులారి నాగేంద్రప్రసాద్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో ఆరోగ్యశ్రీ వంటి సేవలు ఆసుపత్రిలో అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎనెల్ ఆసుపత్రి చైర్మన్ నాగేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా చేసింది టీడీపీనే

**● మాజీ మంత్రి నారాయణ**

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 8:** నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగను రాష్ట్ర పండుగగా చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వందేనని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 42, 43 డివిజన్లలోని డైకాస్‌రోడ్డు, మేకలదొడ్డి, పెద్దబజార్, కుమ్మరివీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## అరవపాలెంలో ఆలయాల ప్రారంభం


**నెల్లూరు(సాంస్కృతికం) :** నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 49వ డివిజన్ పొర్లుకట్ట ప్రాంతంలోని అరవపాలెంలో నిర్మించిన ఆలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో డాక్టర్ నారాయణ, ఆయన సతీమణి రమాదేవితో కలిసి పాల్గొన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఆలయాల నిర్మాణాలకు నారాయణ సొంత నిధులు అందజేశారు. ఆలయాల నిర్మాణాలు పూర్తి కావడంతో మహాశివరాత్రితోపాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున అట్టహాసంగా ఆలయాల ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# కోటంరెడ్డి సమక్షంలో టీడీపీలోకి యువత

**నెల్లూరు(విద్య), మార్చి 8 :** నగరంలోని 34వ డివిజన్ సారాయి అంగడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో స్థానిక యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేయడం దారుణమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా దొరికిన ఇసుకను నేడు అధిక ధరలకు విక్రయించడంతో పాటు మధ్య తరగతి ప్రజలను కరెంట్ బిల్లులతో షాక్ కొట్టిస్తున్నారన్నారు. అందరూ సమిష్టిగా కృషి చేసి టీడీపీ-జనసేన కూటమికి భారీ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

# వెంకయ్యను కలిసిన జనసేన నేతలు

**వెంకటాచలం, మార్చి 8:** స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును శుక్ర వారం సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు కలిశారు. ఈ సందర్భంగా వెంకయ్యను సన్మానించి మొక్కను అందజేశారు. అనంతరం వెంకటాచ లంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు పేద మహిళలు, వృద్ధులను సన్మానించి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మహిళా అధ్య క్షురాలు వాణిభవాని, నాయకులు మల్లికార్జున్, సందూరి శ్రీహరి, బోలా అశోక్, సుమన్ ఉన్నారు. కాగా జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కూడా వెంకయ్యను కలిశారు.


వెంకయ్యకు శాలువాతో సన్మానించి మొక్కను అందజేస్తున్న జనసేన నాయకులు

# అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు ప్రారంభం

**కోవూరు, మార్చి 8:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్ర వారం అంతర్ జిల్లాల పురుషుల కబడ్డీ పోటీ లను జిల్లా వ్యవ సాయ సలహామం డలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజనబాబు రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, నాయకులు కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, గోపిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి లవకుమార్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా జట్టుకు కైలాసం శ్రీనివాసులురెడ్డి సహకారమందిస్తుండగా కోచ్‌గా కొండలరావు వ్యవహరిస్తున్నారు.


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న దొడ్డంరెడ్డి నిరంజనబాబు రెడ్డి

# టీడీపీతోనే ముస్లిం, మైనారిటీల సంక్షేమం

**బుచ్చిరెడ్డిపాళెం ,మార్చి8:** తెలుగుదేశం పార్టీతోనే ముస్లిం, మైనారిటీల సంక్షేమం సాధ్యమని కోవూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. బుచ్చి నగర పంచాయతీలోని 7వ వార్డు పరిధిలో ఆవార్డు ఇన్‌చార్జ్ షబ్బీర్, మున్నాలతో కలిసి ఆయన శుక్రవారం ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో ఖాజానగర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా టీడీపీనే గెలిపించుకుంటాం తిరిగి మా ముస్లిం, మైనారిటీల పథకాలు మాకు ఇప్పించండని మొరపెట్టుకున్నారు. సమస్యలన్నీ నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పథకాలన్నీ అమలయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంవీ శేషయ్య, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రామానాయుడు, చైతన్య, హరనాద్, సుల్తాన్, సర్దార్, రాఘవ రెడ్డి, కొండయ్య, తాళ్ళస్వామి, సుల్తాన్, కిషోర్, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మభ్యపెట్టే పథకాలు మాకొద్దు

**నెల్లూరు(వైద్యం), మార్చి 8 :** విద్య, వైద్యం ఉచితంగా అందించాలే తప్ప మభ్యపెట్టే పథకాలు మాకొద్దని ఏఐఎస్ఎఫ్ కన్వీనర్ మున్నా డిమాండ్ చేశారు. శుక్రవార విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను ప్రభుత్వం అడ్డుకోలేక పోతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో షేక్ బాదుల్లా, అల్లాఫ్, ఖాదర్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

## నవ దంపతుల నేత్రదానం

**నెల్లూరు(వైద్యం), మార్చి 8 :** చెముడుగుంట వద్ద గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవ దంపతులు కొప్పోలు ప్రశాంత్, కొప్పోలు పుష్పల కుటుంబ సభ్యులు మృతుల నేత్రాలన ఉదానం చేశారు. శుక్రవారం కుటుంబ సభ్యుల అనుమతితో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐ బ్యాంక్ సిబ్బంది మృతుల నేత్రాలను సేకరించారు.

**మరో మహిళ :** నగరానికి చెందిన సీతాలక్ష్మి (54) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ప్రగతి లయన్స్ క్లబ్ సహకారంతో నేత్రాలను దానం చేశారు.

## జీజీహెచ్‌లో కార్మికులకు చీరల పంపిణీ

**నెల్లూరు(వైద్యం), మార్చి 8 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వర రెడ్డి, వైసీపీ నగర అధ్యక్షుడు పెంచలరెడ్డి పాల్గొన్నారు.

# ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తా

**● డాక్టర్ పిట్టి మల్లిఖార్జునరావు**



**నెల్లూరు(హరనాథపురం), మార్చి 8 :** శ్వాసకోస వైద్య నిపుణుడిగా ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న తాను త్వరలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు శ్రీర త్నం హాస్పిటల్ అధినేత డాక్టర్ పిట్టి మల్లి ఖార్జునరావు చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తన కుటుంబసభ్యులు ఇప్పటికే రాజకీయాల్లో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నారని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాలలోకి వస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

## వృద్ధులకు అన్నదానం

**పొదలకూరు, మార్చి 8:** మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని నరసారెడ్డి కాలనీలోని వృద్ధులకు లింగంపల్లికి చెందిన టీడీపీ యువ నాయకుడు డేగా యశ్వంత్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుంటి రమణయ్య, గుంటి వెంకటేశ్వర్లు, గార్ల యశ్వంత్, కొంగి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు అలిపిరి నడక దారిలో అక్రమ దుకాణాలు వెలుస్తున్నాయి. ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు జారీ చేస్తుండగా దుకాణాల ఏర్పాటుకు ఓ బడా మంత్రి అనుచరులు రంగంలోకి దిగుతున్నారు.అసలే వ్యాపారాలు తగ్గాయని వాపోతున్న టీటీడీ లైసెన్సుడు దుకాణదారులు వీరిని అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఆందోళనలు, ఘర్షణలు తలెత్తుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

కొద్దిరోజుల క్రితం నడకమార్గంలో ఏర్పాటైన మరో దుకాణం



# అలిపిరి నడక దారిలో అక్రమ షాపులు!

- ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు
- షాపుల ఏర్పాటుకు రంగంలోకి దిగిన బడా మంత్రి అనుచరులు
- అడ్డుకుంటున్న టీటీడీ లైసెన్స్‌డ్ షాపుల నిర్వాహకులు

అలిపిరి మెట్ల దారిలో ఇప్పటి వరకూ టీటీడీ, దేవాదాయ శాఖలు మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నాయి.ఏడవ మైలు వద్ద మాత్రమే రెండు హోటళ్లకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది.అద్దెలు విపరీతంగా పెరిగిపోవడం, దానికి తగిన వ్యాపారం జరగక ఆ రెండు హోటళ్లూ ఎప్పుడో మూతపడ్డాయి. తర్వాత వేలం పాటల్లో ఎవరూ పాల్గొనకపోవడంతో హోటళ్లు తెరుచుకోలేదు. అలాంటిది ఇపుడు ఏకంగా 30 షాపులకు అనుమతులు జారీ చేసింది. 2397వ మెట్టు వద్ద, చిట్టెక్కుడు వద్ద హిమాచల్ ప్రదేశ్ దుకాణం ఎదుట, 7వ మైలు ప్రాంతంలో 2400వ మెట్టు, 35వ మలుపులో 2403, 2410, 2415వ మెట్ల వద్ద, 2425వ మెట్టు, జింకలపార్కు సమీపాన 2542వ మెట్టు వద్ద, 2450వ మెట్టు వద్ద, జింకల పార్కు పరిధి 2550వ మెట్టు వద్ద, 2597వ మెట్టు, 2610వ మెట్టు, 2625వ మెట్టు, 2655వ మెట్టు, జింకల పార్కు మండప సమీపాన 2660 మెట్టు, 7వ మైలు ప్రాంతంలోని మండపం దగ్గర 2687వ మెట్టు, 2726వ మెట్టు, 2735వ మెట్టు, దొరసాని మండపం సమీపాన 2760వ మెట్టు, దొంగల మండపం సమీపాన 2796వ మెట్టు, అటవీ శాఖ సరిహద్దు లైను సమీపాన 2814వ మెట్టు, 2815వ మెట్టు, 2825వ మెట్టు, వ్యూ పాయింట్ సమీపాన 2832వ మెట్టు, ఎస్ఎస్ టెంపుల్ సమీపాన 2851, 2866వ మెట్ల వద్ద, కొత్త మండపం సమీపాన 2931వ మెట్టు, 7వ మైలు మండపం వద్ద రెండు, 7వ మైలు మ్యూజియం వద్ద ఒకటి చొప్పున మొత్తం 30 షాపులకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది.వీటితో కొందరు అర్ధరాత్రిళ్ళు స్తంభాలు నాటి ఇనుప రేకులతో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలు జింకలపార్కు, ఏడవ మైలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే అక్కడ టీటీడీ నుంచీ లైసెన్సు పొందిన వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరికి గతంలో తిరుమలలో లేపాక్షి నుంచీ సీఆర్వో వరకూ సబ్‌వేలో దుకాణాలుండేవి. అయితే అక్కడ వ్యాపారం జరగకపోవడంతో లక్కీ డిప్ ద్వారా అలిపిరి నడక దారిలో టీటీడీ దుకాణాలు కేటాయించింది . అయితే అక్కడ కూడా వ్యాపారాలు పెద్దగా సాగడం లేదు. కాలినడక భక్తులకు ఉచిత దర్శన టోకెన్లు అలిపిరిలోనే జారీ చేస్తుండడంతో నడక దారిలో వెళ్ళే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆ దారిలో వ్యాపారాలూ తగ్గాయి. దానికి తోడు చిన్నారులపై చిరుత పులులు దాడులు జరపడంతో అటవీ శాఖ అధికారులు తినుబండారాల విక్రయాలు వద్దని ఒత్తిడి పెంచారు. నడకదారి భక్తుల సంఖ్యా తగ్గింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో వున్న లైసెన్సుడు దుకాణదారులకు అటవీ శాఖ ద్వారా దొడ్డిదారిన షాపుల ఏర్పాటుకు కొందరు ప్రయత్నించడం కడుపు రగిలేలా చేస్తోంది. గత పదిరోజుల్లో పలు మార్లు కొత్త వ్యక్తులు దుకాణాల ఏర్పాటుకు యత్నించడం పాత దుకాణదారులు వాటిని కూల్చేయడం జరుగుతోంది. తాజాగా గురువారం కూడా కొత్తవ్యక్తులు కూలీలను పెట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా పాత వ్యాపారులు వాటిని అడ్డుకుని కూల్చివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడ ఘర్షణలు కూడా తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది.



ఏడవమైలు వద్ద నిర్మించిన దుకాణాన్ని తొలగిస్తున్న పాత దుకాణదారులు

## ఎవరీ షాపులు దక్కించుకున్నవారు?

అలిపిరి నడక దారిలో 30 షాపులు ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుల పేరిట కేటాయింపులు జరిగాయి. బి.సుబ్రమణ్యం రెడ్డి, బి.శోభారాణి, ఎం.చంద్రబాబు, ఎస్.కృష్ణయ్య, ఎం.చంద్రశేఖర్, కె.వినోద్‌కుమార్, ఆర్.దీపిక, ఎస్.జయమ్మ, పి.హంస, ఎం.బాబు, సౌందర్య, జి.విజయ, సి.పద్మరాణి, ఎం.సుబ్రమణ్యం, ఆర్.నరసింహులు, వై.రాజశేఖర్, కె.లక్ష్మీదేవి, వై.హరిబాబు, సి.నాగరాజ, సి.మునిరాజ, బి.రేఖ, జి.చెంచెలక్ష్మి, వై.అనసూయమ్మ, వై.చండీప్రియ, వి.మదనమోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎం.పుష్పవేణి, వి.కృష్ణప్రసాద్‌రెడ్డి, డి.వెంకటేశులు పేర్లతో షాపులకు అనుమతులు జారీ అయ్యాయి. అసలు వీరంతా ఎవరో, ఎక్కడి వారో, వీరు ఎకో డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఎలా చేరారో పరిశీలించాల్సి వుంది. వీరంతా సదరు మంత్రి అనుచరులన్న ప్రచారం వుంది.వీరెవరికీ టీటీడీ నుంచీ అనుమతులు లేకపోయినా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూండడం గమనార్హం.

## తాము వద్దన్న పనిని తామే చేస్తున్న అటవీశాఖ

అలిపిరి నడక దారిలో చిన్నారులపై చిరుత పులులు దాడులు చేయడంపై అధ్యయనం జరిపిన వైల్డ్ లైఫ్ అటవీ శాఖ ఉన్నతాధికారులు పలు అంశాలను గుర్తించారు. నడక దారి పొడవునా దుకాణాల్లో తిను బండారాలు విక్రయిస్తుంటారు. గతంలో జింకల పార్కు వున్నందున జింకలకు పాదచారులు తినుబండారాలు అలవాటు చేశారు. వాటికోసం జింకలు గుమిగూడేవి. అవి తినగా మిగిలే వ్యర్థాలను, నడక దారి భక్తులు పడేసే వ్యర్థాలు, దుకాణాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలు కూడా అక్కడే పోగుపడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం ఎలుగుబంట్లు రావడం మొదలైంది. మరోవైపు జింకల కోసం చిరుత పులులు మాటేయడానికి అలవాటు పడ్డాయి. కాలక్రమంలో జింకల పార్కు ఎత్తేసినా అలవాటు పడిపోయిన జింకలన్నీ ఆ ప్రాంతంలోనే ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఈ కారణంగానే చిరుతలు మెట్ల దారి వద్దకు వచ్చి మాటేయడం, అందుబాటులో చిన్నారులు కనిపించినపుడు దాడి చేసి లాక్కెళ్ళడం జరుగుతోంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఇదే అంశాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో తినుబండారాలు విక్రయించే దుకాణాలు ఎత్తివేయాలని సిఫారసు చేశారు.అదే అటవీ శాఖే ఇపుడు తినుబండారాల దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.పైగా 7వ మైలు ప్రాంతంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతివ్వడమే నిబంధనలకు విరుద్ధమన్న వాదన వినిపిస్తుండగా దానికి ఎంచుకున్న మార్గం కూడా మరింత అక్రమంగా కనిపిస్తోంది. తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి జి.సతీష్ దీనిపై గతేడాది నవంబరు 10వ తేదీన టీటీడీ ఈవోకు రాసిన లేఖలో అలిపిరి నడక దారిలోని 7వ మైలు ప్రాంతంలో ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తమ జీవనోపాధి కోసం తాత్కాలిక దుకాణాలు నడుపుతున్నారంటూ వాటి వివరాలు పేర్కొన్నారు. ఆ లేఖలోనే ఈ తాత్కాలిక దుకాణాలు 2018 నుంచీ నడుస్తున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి అధికారికంగా అయినా అనధికారికంగా అయినా నడక దారిలో అటవీ శాఖకు దుకాణాలే లేవని సమాచారం. 7వ మైలు వద్ద కేవలం రెండు దుకాణాలు మాత్రమే వుండేవని అవి కూడా పదిహేనేళ్ళ కిందట మూతపడ్డాయని సమాచారం. అయినా 2018 నుంచీ 30 తాత్కాలిక దుకాణాలు నడుస్తున్నాయని బాధ్యత కలిగిన జిల్లాస్థాయి అధికారి టీటీడీకి నివేదించడం విమర్శలకు దారి తీస్తోంది.

## తెర వెనుక అసలు సంగతేమిటంటే...

టీటీడీ వ్యవహారాల్లో ముఖ్యంగా కొండపైన అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతల నడుమ ఆరు నెలలుగా ఆధిపత్య పోరు సాగుతోంది. తన అనుచరులకు మేలు చేసేలా దుకాణాల ఏర్పాటు వంటి వాటికి ఓ బడా మంత్రి చేస్తున్న సిఫారసులను టీటీడీ బుట్టదాఖలా చేస్తోందని సమాచారం. దర్శనాలు మినహా మిగిలిన పాలనా వ్యవహారాల్లో, లబ్ధి కలిగే ఏ అంశంలోనూ మంత్రి మాట చెల్లుబాటు కావడం లేదని వైసీపీ వర్గాల్లోనూ, టీటీడీ వర్గాల్లోనూ ప్రచారమవుతోంది. ఈ పరిణామాలతో ఆగ్రహించిన మంత్రి తనకున్న పలుకుబడి వినియోగించారని, దాంతో తిరుమలలో తన పరిధి కలిగివున్న ప్రభుత్వ అటవీ శాఖ తెర మీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక దారుల్లో కొన్ని ప్రాంతాలు, అలాగే కొండపైన పాపనాశనం వంటి చోట్ల కొన్ని ప్రాంతాలు ప్రభుత్వ అటవీ శాఖ పరిధిలో వున్నాయి. పాపనాశనం వద్ద ఆ శాఖ అనుమతితో ఎప్పటి నుంచో దుకాణాలు నడుస్తున్నాయి. గతంలో 7వ మైలు వద్ద రెండు దుకాణాలు ఆ శాఖ అనుమతితో నడిచేవి.వ్యాపారం జరగక మూతపడ్డాక వాటిని పునరుద్ధరించలేదు.ఈ నేపథ్యంలో మంత్రి ఒత్తిడితోనే అటవీ శాఖ అధికారులు 2018నుంచీ ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులైన 30మందికి తాత్కాలిక దుకాణాలు నడక దారిలో వున్నట్టు నిర్ధారించి టీటీడీ ఈవోకు లేఖ రాయడం వివాదాస్పదంగా మారుతోంది.

## టీటీడీ భద్రత, పర్యవేక్షణ ఏమైందో శ్రీవారికెరుక!

టీటీడీ భద్రత, పర్యవేక్షణల్లో లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తాజాగా అలిపిరి నడక దారిలో కొత్త దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న యత్నాలే దానికి నిదర్శనం. అలిపిరి చెక్ పాయింట్ నుంచీ కొండపైదాకా ఇటు నడక దారిలోనూ, అటు ఘాట్ రోడ్లనేనూ, కొండపైనా ఎక్కడ చీమ చిటుక్కుమన్నా టీటీడీకి తెలియాలి. దానికి తగ్గ భద్రతా, నిఘా వ్యవస్థ దేవస్థానానికి వుంది. అయితే అలిపిరి నడక దారిలో పట్టపగలు, అలాగే అర్ధరాత్రిళ్ళు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతున్నా టీటీడీకి తెలియకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దుకాణాల ఏర్పాటుకు నిర్మాణ సామగ్రి టీటీడీ భద్రతా, నిఘా వ్యవస్థల కంట పడకుండా 7వ మైలు దాకా ఎలా చేరుతోందన్నది ప్రశ్న. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటే నిరంతరం నడక దారిపై నిఘా వేసి వుంచే విజిలెన్స్ యంత్రాంగానికి ఎందుకు తెలియడం లేదన్నది మరో ప్రశ్న. చివరికి అక్కడ పాత దుకాణదారులకు, కొత్తగా వస్తున్న వారికి గొడవలు జరుగుతున్నా కూడా టీటీడీ అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.మంత్రి ఒత్తిడితో సంబంధిత వ్యవస్థ చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని భావించాల్సివస్తోంది.



ముక్కంటి ఆలయంలో బారులు తీరిన భక్తులు

## యంత్రాంగం... వీఐపీలకు దాసోహం

- ఇబ్బడి ముబ్బడిగా పాసుల జారీ
- కాసులు కురిపించిన స్థానికుల టికెట్లు

శ్రీకాళహస్తి, మార్చి 8: ముక్కంటి శివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇక్కట్లు తప్పలేదు.అధికార యంత్రాంగం నెల రోజుల ముందు నుంచీ సామాన్య భక్తులకు పెద్దపీట అంటూ ప్రకటనలిచ్చారు.చివరకు వారికి దర్శనమే దుర్భరంగా మారింది.వీఐపీలకు ఆహ్వానం పలికేందుకు ఎన్నడూ లేని విధంగా కొత్త షెడ్డును నిర్మించారు. పెద్దఎత్తున అధికారులు నిరీక్షణలు సాగించారు.అలాగే వీఐపీల కోసం ప్రత్యేకంగా దక్షిణ గోపుర మార్గాన్ని కేటాయించారు.అధికార యంత్రాంగమంతా వీఐపీల సేవలోనే తరించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆలయంలో కూడా క్యూలైన్ల నిర్వహణ ఈసారి భక్తులకు అసంతృప్తిని కలిగించింది. గురుదక్షిణా మూర్తి వద్ద అడ్డదారిలో వచ్చే వారు క్యూలైన్లలో కలిసి పోయారు. స్వామి వారి గడప వద్ద ఎమ్మెల్యే , వైసీపీ పరివారం గర్భగుడిలో తిష్ట వేశారు. అయిన వారిని అంతరాలయంలోకి తీసుకెళ్తూ వారి సేవలో తరించారు. కొందరు వైసీపీ కార్యకర్తలు క్యూలైన్ల పైకి ఎక్కి దూకుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.మహాలఘుదర్శనం అంటేనే స్వామివారి మూలమూర్తి దూరంగా కనిపిస్తారు.అంతరాలయంలోకి అధికార పార్టీకి అయినవారు దర్శనాలకు వెళ్లి తిష్ట వేస్తూ ఉండడంతో సామాన్య భక్తులకు కనులారా స్వామివారిని దర్శించుకునే అవకాశం కూడా లేకపోయింది.అమ్మవారి సన్నిధిలో కూడా సామాన్య భక్తులకు తీవ్ర నిరాశే ఎదురైంది.ఎక్కడో రాశి చక్రం దగ్గర నుంచి దూరంగా కనిపించీకనిపించనట్టుగా అమ్మవారిని దర్శించుకోవాల్సి వచ్చింది.మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద ఆలయం పైనుంచి భక్తులు వెలుపలకు వెళ్లేలా క్యూ లైన్ ఏర్పాటు చేశారు. కానీ ఆ కొండలాంటి మెట్లు ఎక్కే మార్గంలో సామాన్య భక్తులు తప్ప ఎవరూ నడవలేదు. చాలామందికి మృత్యుంజయ ఆలయం వద్ద గేట్లు తెరిచి మరీ పదే పదే మహా ద్వారం నుంచి వెలుపలకు పంపారు. దీంతో యధావిధిగా కంచు గడప వద్ద క్యూలైన్ స్తంభించడం జరిగింది.ట్రాఫిక్ నియంత్రణ మాత్రం ఈసారి కొంత మెరుగ్గా నిర్వహించారు.శివరాత్రి పాసులు ఇష్టారాజ్యంగా జారీ చేశారు. వైట్ కాలర్ ముసుగులో పాసులు పొందిన కొందరు దళారీలు అత్యంత రద్దీ సమయంలో కూడా అడ్డదారిలో దర్శనాలకు ఎగబడ్డారు.స్థానికుల కోటా టికెట్లను కొందరు దళారీలు యథేచ్ఛగా దుర్వినియోగం చేశారు. రూ.500 క్యూ లైన్‌లో పంపే టికెట్లను స్థానికుల కోసం ఒకరోజు ముందు 200 రూపాయలకే జారీ చేసిన విషయం తెలిసిందే. పథకం ప్రకారం కొందరు దళారీలు గురువారమే టికెట్లు కొనుగోలు చేసి శుక్రవారం రూ.500కు అమ్ముకున్నట్లు సమాచారం.



ఆలయం వద్ద భక్తులను దాటుకొని గేట్లు దూకుతున్న వైసీపీ కార్యకర్త

## సర్వం...శివోహం



నంది, సింహ వాహనాలపై ఆదిదంపతుల విహారం

శ్రీకాళహస్తి, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా ఈశ్వరాలయాలన్నీ శుక్రవారం భక్తులతో పోటెత్తాయి.దక్షిణ కైలాసంగా వర్ధిల్లుతున్న ముక్కంటి ఆలయంలో ఉదయం పలుచగా కన్పించినా 11గంటల నుంచీ మొదలైన రద్దీ రాత్రి వరకూ కొనసాగింది.అప్పుడప్పుడూ తోపులాటలు కూడా జరిగాయి. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు.. పితృదేవతలకు తర్పణాలు జోరుగా సాగాయి. శివ రాత్రిని పురస్కరించుకుని వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో దర్శనమిచ్చారు.రోజూ నాలుగు అభిషేకాలు జరిగితే శివరాత్రి వేళ ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు ప్రథమ, ద్వితీయ కాలాభిషేకాలు, ఉచ్చి కాలాభిషేకంతో పాటు మరో మూడు కాలాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకూ ప్రత్యేకంగా మూడు కాలాల అభిషేకాలు జరిగాయి.అర్ధరాత్రి తరువాత 2 గంటలకు 10వ కాల అభిషేకం (శుద్ధి అభిషేకం) 4.30 గంటలకు 11వ కాల అభిషేకం(బ్రహ్మాభిషేకం) జరిగాయి.శుక్రవారం వేకువజామున 2 గంటలకు గోపూజ నిర్వహించాక గోమాత స్వామి అమ్మవార్లను మొదట దర్శించుకుంది. సుప్రభాత సేవ తరువాత 3 గంటల నుంచీ భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకాలతో స్వామివారు నిత్యాభిషేక దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబిక దేవికి కూడా వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు.రాజగోపురం సమీపం నుంచి సామాన్య భక్తుల ఉచిత దర్శనానికి, రూ.50 టికెట్లు కొనుగోలుచేసిన వారికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం లోపల మహాలఘుదర్శన విధానం అమలు చేశారు.ప్రత్యేక దర్శన టిక్కెట్టు రూ.500, స్థానికుల టికెట్లు కొనుగోలు చేసిన వారిని 3వ నంబరు గేటు (తిరుమంజన గోపురం) వైపు నుంచి అనుమతించారు. దర్శనానంతరం భక్తులను బయటకు పంపడానికి మృత్యుంజయ లింగం వద్ద నుంచి ఆలయం పైకి వెళ్లి భక్తకన్నప్ప కొండ మెట్ల మార్గం వద్దకు చేరుకునేలా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి మహాద్వారం వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు.

శుక్రవారం అర్ధరాత్రి నందిసేవకు హాజరైన భక్తజనం



ఇంద్ర విమానం, చప్పరంపై ఆదిదంపతుల పురవిహారం



## నయనోత్సవం నంది సేవనం

శ్రీకాళహస్తీశ్వరుడి నందిసేవ శుక్రవారం రాత్రి నయనోత్సవంగా సాగింది.శివరాత్రి జాగరణ చేసే భక్తుల కోసం ఆదిమధ్యాంత రహితుడైన సర్వేశ్వరుడు తనకు ఎంతో ప్రీతికరమైన నందిపై దివ్యదర్శనమిచ్చారు. ఊరేగింపును తిలకించేందుకు... జాగరణ చేసి మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడవీధులు కిక్కిరిసిపోయాయి.జ్ఞానప్రసూనాంబాదేవి సింహవాహనాన్ని అధిరోహించి అనుసరించారు.ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానంపై, జ్ఞానప్రసూనాంబదేవి చప్పరంపై అధిరోహించి పురవిహారం చేశారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప ముందుసాగగా దివ్యాభరణాల ధగధగలతో పురవిహారం చేస్తున్న పార్వతీ పరమేశ్వరులను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో చతుర్మాడవీధులు నిండిపోయాయి. ఊరేగింపులో ప్రదర్శించిన కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, ఆలయ చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, ఉభయదారులు పాల్గొన్నారు.



శివరాత్రి సాంస్కృతిక ప్రదర్శనల్లో శ్రీకాళహస్తికి చెందిన ఆషా నృత్యవిన్యాసం

# కలకలం రేపిన సూసైడ్ సెల్ఫీ వీడియో

## పోలీసుల అప్రమత్తతతో యువకుడు క్షేమం



నిరంజన్‌ను కుటుంబసభ్యులకు అప్పచెబుతున్న పోలీసులు

వెంకటగిరి, మార్చి 8: వెంకటగిరి మండల పరిధిలోని వెలుగొండల్లో వున్న కోనమల్లేశ్వరస్వామి కోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపి కలకలం సృష్టించాడు. వెంకటగిరి పోలీసుల కథనం మేరకు... చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన నిరంజన్ గురువారం కోనమల్లేశ్వరస్వామి కోన అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఓ కొండపై కూర్చొని నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో తీసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియోను వాట్సప్ ద్వారా పంపాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చిత్తూరు పోలీసులు వెంకటగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. వెంకటగిరి ఎస్ఐ సుధాకరరెడ్డి హుటాహుటిన సిబ్బందిని వెంటబెట్టుకొని కోన మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే అటవీ మార్గానికి చేరుకొన్నారు. నిద్రమాత్రలు మింగి మత్తులోకి జారుకున్న నిరంజన్‌ను జీపులో ఎక్కించుకుని వెంకటగిరి తీసుకువచ్చారు. నిద్రమాత్రల మోతాదు తక్కువగా వుండడంతో ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవ పడి వచ్చి ఆత్మహత్యకు యత్నించానని ఆ యువకుడు చెప్పాడు. శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

## రానున్నది ఉమ్మడి ప్రజా ప్రభుత్వమే: పాశం



జనసేన నాయకులతో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 8: రాష్ట్రంలో త్వరలో రానున్నది టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజా ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలకు ధీటుగా టీడీపీ, జనసేన నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికల ప్రచారంలో సమన్వయంతో పనిచేద్దామని అన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జనసేన, టీడీపీ కలిసి పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో మోహన్, ఇంద్రవర్ధన్, భాస్కర్, బాలసుబ్రహ్మణ్యం, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

గూడూరు, మార్చి 8: ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హితవుపలికారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై మేరిగ వ్యక్తిగత విమర్శలు చేయడం మంచి పద్ధతికాదన్నారు. తాను ఎక్కడైనా అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించివుంటే, తన వెంట ఇంత మంది వచ్చేవారు కాదన్నారు. ధైర్యముంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి పోటీలో నిలవాలని సవాల్ విసిరారు. ప్రతిరోజు అనేక మంది టీడీపీలో చేరుతుండడంతో అధికార పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని సునీల్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, వెంకటేష్, గురవయ్య, చంద్రమౌళి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే మహిళా సాధికారిత: విజయశ్రీ



కేక్ తినిపించుకుంటున్న విజయశ్రీ, తెలుగు మహిళలు

నాయుడుపేట టౌన్, మార్చి 8: టీడీపీతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మహిళలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ రాజకీయాల్లో యువతను ప్రోత్సహించే క్రమంలో వైద్య వృత్తిలో ఉన్న తనకు టికెట్‌ను కేటాయించి మహిళలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు చక్రాల ఉషారాణి, మాజీ సర్పంచు గూడూరు ప్రభావతమ్మ, గుణసుందరి, ప్రమీల, సుజాత, సుగుణమ్మ, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సర్టిఫికెట్లతో మహిళలు

గూడూరు, మార్చి 8: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్మయి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక సునీత సేవాసంస్థ కార్యాలయంలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సునీత సేవాసంస్థ 24 ఏళ్లుగా వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, లావణ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## 12న ఉద్యోగ మేళా

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 8: పద్మావతీపురంలోని సబ్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో ఈనెల 12న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలో రీటైల్ ట్రైనీ అసోసియేట్ లేదా ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 వయసు కలిగి 10, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, ఎంఫార్మా, బీఫార్మా, డీ ఫార్మా అర్హత కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. నెలకు జీతం రూ.13,500 నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8121015844ను సంప్రదించాలని కోరారు.

# ఎటుచూసినా శివనామస్మరణే



సూళ్లూరుపేటలోని సంతానేశ్వరస్వామి అభిషేకానికి కాళంగి నది నుంచి జలాలను తీసుకెళ్తున్న భక్తులు



చిట్టమూరు: యాకసిరితిప్పపై శివలింగాలకు భక్తుల పూజలు



గూడూరు: సోమసుందేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించి శివుడికి అభిషేకాలు, హోమాలు జరిపారు. శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. గూడూరు పట్టణంలోని శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సోమసుందేశ్వరస్వామి ఆలయాల్లో శివలింగాలకు భక్తులు పూజలు జరిపి అభిషేకాలు నిర్వహించారు. సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి అన్నాభిషేకం చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా వాయు శివలింగాన్ని ఏర్పాటు చేశారు. రుద్రాక్ష, మంచు శివలింగాలను ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

**చిల్లకూరు:** మండలంలోని చేడిమాల గ్రామంలో వెలసిన కామాక్షీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపారు. బూదనంలోని భవానీ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఏరూరులోని జ్ఞానప్రసూనాంబ కాళహస్తీశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపారు.

**డక్కిలి:** మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో పిండిదీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే వెంబులూరు సమీపంలోని యోగ లక్ష్మీనరసింహ స్వామి, మోపూరు శివాలయం, డక్కిలిలో ప్రసన్న వెంకటేశ్వర్ల స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**వాకాడు:** మండలంలోని తిరుమూరు భీమేశ్వరాలయం, పంట్రాగం కామాక్షీదేవి, పాండురంగేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, వాకాడు నాగేశ్వరాలయం, జువ్వినట్టు అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరాలయం, తూపిలి బ్రహ్మలింగేశ్వర స్వామి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం జరిపించారు. పంట్రాంగం ఆలయంలో భక్తిపాటలు పాటకచ్చేరి చేపట్టారు.

**కోట:** గూడలి కొండపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, వైసీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనంజయ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గూడలిలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అదే విధంగా వంజివాకలోని జలసిద్దేశ్వరి ఆలయం, పుచ్చలపల్లిలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయం, అల్లంపాడు, కొత్తపట్నంలోని పురాతన శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

**బాలాయపల్లి:** మండలంలోని సుబ్రమణ్యం గ్రామంలోని సుబ్రమణ్యస్వామి దేవాలయం, చుట్టి గ్రామంలోని మల్లయ్య స్వామి ఆలయం, చిలమనూరులోని పాండురంగస్వామి దేవాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు జరిగాయి. చిలమనూరు పాండురంగస్వామి ఆలయంలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

**వెంకటగిరి టౌన్:** పట్టణంలోని రామలింగేశ్వర ఆలయం, కాశీవిశ్వనాథ ఆలయం, వల్లివేడు క్రాస్ వద్ద ఉన్న మల్లిఖార్జున ఆలయం, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రం ఆలయాల్లో మహాశివరాత్రి పూజలు జరిగాయి. కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో ఉత్సవమూర్తి పురవీధుల్లో ఊరేగించారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పాలాభిషేకం చేశారు. అనంతరం గణపతి హోమం, ప్రదోషకాల పూజలు, సామూహిక కుంకుమార్చణ, నందివాహన సేవ, ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అఖిలాండేశ్వరీ సమేత జంబుకేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి, గంగా కామాక్షీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సూళ్లూరుపేట:** స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్‌ను అభిషేకించారు. ఉదయం స్వామివారికి అరుణోదయాభిషేకం, మధ్యాహ్నం తపనోదయాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలాభిషేకం, రాత్రి స్వామివారికి లింగోద్భవ కాలాభిషేకం చేశారు. అదేవిధంగా మన్నారుపోలూరు కాళంగి నదీ తీరాన వెలసిన సంతానేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామున నుంచే భక్తులు పోటెత్తారు. సంతాన ప్రాప్తికోసం వందలాది మంది జంటలు బిందెలు, చెంబులతో కాళంగి నది జలాలను తెచ్చి శివలింగాన్ని అభిషేకించారు. అటీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడికి అభిషేకాలు చేశారు.

**పెళ్లకూరు:** మండలంలోని శిరసనంబేడు, పెళ్లకూరు, చిల్లకూరు వడ్డిపాళెం, చింతపూడి గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో శివలింగాలకు అభిషేకాలు చేశారు.

**చిట్టమూరు:** మండలంలోని మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, యాకసిరి తిప్ప భూపతేశ్వర స్వామి, పాటిమిట్ట నగరేశ్వర స్వామి, గునపాడు నాదేశ్వర స్వామి, పెళ్ళకూరు మల్లీశ్వర స్వామి, చిట్టమూరు శివాలయం, మల్లాం కామాక్షి, సమేత మార్కెండేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తడ, మార్చి 8: స్థానిక భువనేశ్వరస్వామి ఆలయం, చిన్నమాంబట్టులో వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో, వాటంబేడులోని విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయం, అక్కంపేట వద్ద ఉన్న మునీశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే మహాశివలింగాలకు పాలాభిషేకాలు జరిపించారు. గోపూజలు, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. స్థానిక నిప్పో పరిశ్రమ ఎండీ పొట్టిపాటి ద్వారకానాథ్‌రెడ్డి సౌజన్యంతో సుమారు 3వేల మందికి అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి సిమ్స్ వైద్యులు మునస్వామి, నిప్పో పరిశ్రమ డీజీఎం మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవాలు నిర్వహించారు.







గూడూరు: సాయిసత్సంగ నిలయంలో శివలింగానికి అన్నాభిషేకం, బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రుద్రాక్ష శివలింగం - కోట: విశేషాలంకరణలో భీమేశ్వరుడు - తడ: చందన అలంకారంలో మహాశివుడు - నాయుడుపేట: నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పాలాభిషేకం చేస్తున్న భక్తులు

## మహిళా చైతన్యంతోనే సమాజ పురోగతి: మాజీ ఎమ్మెల్సీ విఠపు




కార్యక్రమంలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, మార్చి 8: మహిళా చైతన్యంతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో స్త్రీకి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. మనకు విద్య, సంపద, ధైర్యం వంటి అన్ని అవసరాలను తీర్చే దేవతలు స్త్రీమూర్తులేనని అన్నారు. అనంతర మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఆశ్రిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక సాయినగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహిళ దినోత్సవం నిర్వహించారు. నెర్రికాలువ కట్టపై నివాసం ఉంటున్న పేదలకు బట్టలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు విజయకుమారి, ఉపాధ్యాయులు రుక్మిణి, ఉషా, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి దిశ, దశ: నెలవల



టీడీపీలో చేరిన వైసీపీ జిల్లా కార్యదర్శి హరితో నెలవల సుబ్రమణ్యం

నాయుడుపేట టౌన్, మార్చి 8: రాష్ట్రానికి దిశ, దశ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. వైసీపీ జిల్లా కార్యదర్శి కరింబాయి హరి టీడీపీలో చేరడంతో ఆయనకు పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ రాక్షస పాలనతో రాష్ట్రాభివృద్ధి కుంటు పడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాట పట్టాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఇటీవల జరిగిన జయహో బీసీ సదస్సులో బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాని తీసుకురానున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో బీసీలను హింసించడంతో పాటు ఎంతో మందిని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ నేత శిరసనం జేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పనీ చేయలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఫీ, చంద్రారెడ్డి, న్యాయవాది పసల చెంగయ్య, శ్రీనివాసులు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి తండ్రికి నగదు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సూళ్లూరుపేట, మార్చి 8: సూళ్లూరుపేట పట్టణం ఇసుక మిట్ట ప్రాంతానికి చెందిన అరిగెల్ల శ్రావణ్ కుమార్, భార్గవి దంపతుల నాలుగేళ్ల కుమారుడు సూర్యతేజ బోన్ మారో వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి వైద్య ఖర్చుల కోసం డిసైర్ టూ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం రూ.65 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బద్దెపూడి నిఖిల్‌రెడ్డి, వేలూరు ప్రభు కుమార్ రెడ్డి, కట్టబోయిన వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుంధతీయపాళెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

గూడూరు, మార్చి 8: స్థానిక అరుంధతీయపాళెంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ వైఫల్యాలను ఎండగట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేస్తే పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, సురేష్, మల్లికార్జున, శివ, మీరయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## దోబీఘాట్ల ఆక్రమణ సరికాదు

నాయుడుపేట, మార్చి 8: నాయుడుపేట స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోని తుమ్మూరులో ఏర్పాటు చేసిన రజకుల దోబీఘాట్లను ఆక్రమించడం సరికాదని రజక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కాలగంధ రత్నం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అక్కురపాక పుట్టయ్య అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రజకుల జీవనోపాధి కోసం తుమ్మూరులో ఏర్పాటు చేసిన దోబీఘాట్లను ప్రభుత్వం ఆధునీకరించాల్సి ఉండగా, వాటిని కొందరు ఆక్రమించుకోవడం అన్యాయమన్నారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## టీడీపీ కార్యకర్త మృతి



కమలాకర్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, మార్చి 8: పట్టణంలోని భరత్‌నగర్‌లో నివాసంలో ఉంటున్న టీడీపీ కార్యకర్త గుజ్జలపూడి కమలాకర్ నాయుడు(41) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. టీడీపీలో కమలాకర్ సేవలను గుర్తు చేసుకున్నారు.

## కేంద్ర భద్రతా దళాల ఫ్లాగ్ మార్చ్



సూళ్లూరుపేట, మార్చి 8: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకొని సూళ్లూరుపేటలో శుక్రవారం కేంద్ర భద్రతా దళాలు ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక కేఎస్ మెగా సూపర్ మార్కెట్ నుంచి జీఎన్‌టీ రోడ్డు మీదుగా హోలీక్రాస్ కూడలి, షార్ సర్కిల్, హాస్పిటల్ రోడ్డు, బాపూజీ వీధిలో ప్రదర్శన నిర్వహించారు. ఎస్ఐ రహీం రెడ్డి పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

కోట, మార్చి 8: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోట రోటరీ క్లబ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు జెన్ని ప్రసాద్, కార్యదర్శి జలీల్‌అహ్మద్, సభ్యులు మోహన్‌రెడ్డి, మోబిన్‌బాషా, షంషుద్దీన్, శీనయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## బీవీపాళెం చెక్‌పోస్టులో బంగారం స్వాధీనం

### జీఎస్టీ చెల్లించలేదంటూ నోటీసులు

తడ, మార్చి 8: జీఎస్టీ చెల్లించకుండా తరలిస్తున్న బంగారు ఆభరణాలను ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ అధికారులు తనిఖీలు చేస్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ఓ వ్యాన్‌లో బంగారు ఆభరణాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని విచారించగా ముంబాయికి చెందిన ఓ సంస్థ పక్కా బిల్లులతో సుమారు 653 గ్రాముల ఆభరణాలు చెన్నైకు తరలించింది. వాటిని నెల్లూరుకు తరలించేందుకు ఒక శాతం జీఎస్టీ చెల్లించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.35 లక్షల విలువైన ఈ ఆభరణాలకు జీఎస్టీ పెనాల్టీ చెల్లించాలంటూ సదరు సంస్థకు నోటీసులు జారీచేసి ఆ ఆభరణాలను సీజ్ చేశారు.

## మహిళలు మనోధైర్యంతో ముందుకెళ్లాలి



మహిళా కార్మికులను సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, మార్చి 8: మహిళలు మనోధైర్యంతో ముందుకెళ్లాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వే అతిథిగృహంలో రైల్వే ఉద్యోగుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇళ్లకే పరిమితం కాకుండా పలు రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలన్నారు. ఝాన్సీలక్ష్మీభాయి, మదర్‌థెరీస్సా వంటివారిని ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు, గోపి, నాగరాజు, గోపాల్, వాసు, కృష్ణప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రామిక మహిళా సంఘం నాయకురాళ్లను సన్మానించారు. శివకుమార్, గోపినాథ్, రమేష్, కోటేశ్వరరావు, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, ప్రభావతి, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీసీ బాలికల వసతిగృహంలో బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కూరపాటి రవీంద్రబాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మినీగురుకులంలో శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాళ్లకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టీడీపీ కార్యాలయంలో తెలుగుమహిళా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## మిగులు భూములను పేదలకు పంచండి

వెంకటగిరి, మార్చి 8: ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచిపెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పెట్లూరు సర్వే నెంబరు 1లో 238 ఎకరాలు, సర్వే నెంబరు 12లో 512 ఎకరాల్లో సీపీఎం జెండాపాతి భూ పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన నాగరాజు మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి ఈ భూముల్లోకి పేదలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖకు చెందిన భూములే అయితే ఇదే సర్వే నెంబరులో జగనన్న ప్లాట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. రికార్డుల పరంగా ఈ భూములు రెవెన్యూ శాఖకు చెందినవని స్పష్టం చేశారు. పేదలపై దౌర్జన్యం చేస్తున్న అటవీశాఖ అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చెంగయ్య, పద్మమ్మ, రమణయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం సీసాల స్వాధీనం

గూడూరు, మార్చి 8: స్థానిక కోర్టుసెంటర్ సమీపంలోని ఓ కూల్‌డ్రింక్స్ దుకాణంలో అక్రమంగా నిల్వవుంచిన 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని దుకాణం యజమానిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ ఏఈఎస్ ఎస్ఐ మోసెస్ అన్నారు. ఆ దాడుల్లో ఎస్ఈబీ సిబ్బంది కిరణ్‌సింగ్, రమేష్, ఆనంద్‌బాబు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్ మార్చి 8: స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామమోహన్‌రావు, సనత్‌కుమార్‌రెడ్డి, శ్యామ్‌యాదవ్, సిద్దారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, డాక్టర్లు రాజా, చంద్రహాస్ పాల్గొన్నారు.